www.flashindianews.com
# ఫ్లాష్ ఇండియా
తెలుగు దినపత్రిక
FLASH INDIA TELUGU DAILY
RNI NO.APTEL/2010/33229

విలేకరులు కావలెను
18సం॥ లుగా వెలుపడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల, మండలాల వారీగా విలేకరులు కావలెను..
★ ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించవలసిన నంబర్ ★
సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 215 | మంగళవారం 06.10.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

## యూఎస్‌తో ట్రేడ్ డీల్‌లో పీటముడి

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సంచలన హెచ్చరిక..!

- సుంకాలపై భారత్-అమెరికా మధ్య పీటముడి
- ఇచ్చిపుచ్చుకునే విషయంలో ఇరు దేశాల తర్జనభర్జన
- రాజీకి రాని భారత్-అమెరికా వైఖరి
- ట్రేడ్ డీల్‌కు అడ్డంకిగా సుంకాల వివాదం

02



## కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు

ఆ రికార్డులను సమర్పించండి.. ఈసీకి సుప్రీం కోర్టు ఆదేశం

- చట్టానికి లోబడే ఈసీ పనిచేయాలి
- సీఈసీపై చర్యకు నిరాకరించిన సుప్రీంకోర్టు
- ఈసీకి నోటీసులు.. పూర్తి వివరణ కోరిన కోర్టు
- ఎన్నికల ప్రక్రియపై సుప్రీం కీలక వ్యాఖ్యలు
- ఉల్లంఘనలు తేలితే నిర్ణయాలు రద్దు చేస్తాం
- ఎన్నికల సంఘంపై సమాధానం చెప్పాలన్న సుప్రీం

02



## 2026 మెడిసిన్ నోబెల్ ప్రైజ్‌ల ప్రకటన..

ఆ ముగ్గురు శాస్త్రవేత్తలకు పురస్కారం

- ఆప్టోజెనెటిక్స్ ఆవిష్కరణకు నోబెల్ గౌరవం
- మెదడు పరిశోధనలో సంచలన ఆవిష్కరణలకు పురస్కారం
- కాంతితో మెదడు కణాల నియంత్రణకు నోబెల్

02




# భూదార్ పేరుతో పాస్ పుస్తకాలు

## 120 ఏళ్ల తర్వాత మళ్లీ రాష్ట్రవ్యాప్తంగా భూ సర్వే

**గుడిసెల్లో ఉన్నవారికి రెండో విడతలో ఇల్లు**
**దసరా నాటికి మరో 2 లక్షల ఇళ్ల పూర్తి**

- భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం
- మూడు విడతల్లో భూ సర్వేకు శ్రీకారం
- ఏడాదిన్నరలో భూ సర్వే పూర్తి
- భూదార్‌తో భూములకు కొత్త గుర్తింపు
- 120 ఏళ్ల తర్వాత మళ్లీ రాష్ట్రవ్యాప్తంగా భూ సర్వే
- భూ సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీ
- భూ వివాదాలు లేని తెలంగాణే లక్ష్యం
- భూ సర్వేతో ప్రతి భూమికి ఎల్‌పీఎం నంబర్
- గుడిసెల్లో ఉన్నవారికి రెండో విడతలో ఇళ్లు

02



**ఆదిలాబాద్,ఫ్లాష్ ఇండియా :**
రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో భూ సర్వేను చేపడుతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో సమీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. రెవెన్యూ, సర్వే, హౌసింగ్, రిజిస్ట్రేషన్ శాఖల పనితీరుపై సమీక్షలు నిర్వహిస్తున్నామని మంత్రి వెల్లడించారు. సుమారు 120 ఏళ్ల క్రితం రాష్ట్రంలో భూ సర్వే జరిగిందని, ప్రస్తుతం మళ్లీ మూడు విడతల్లో భూ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మొదటి విడత సర్వే కొనసాగుతోందన్నారు. భూ సర్వే కీలకమైన అంశమని, ఆర్థిక భారం ఉన్నప్పటికీ ప్రభుత్వం సర్వేను చేపడుతోందని మంత్రి పేర్కొన్నారు. ఏడాదిన్నరలోపు భూ సర్వేను పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. సర్వే అనంతరం ప్రతి భూమికి ఎల్‌పీఎం నంబర్ కేటాయించి, 'భూదార్' పేరుతో పాస్ పుస్తకాలు అందించే ప్రక్రియ చేపడతామని చెప్పారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గిరిజనులు, గిరిజనేతరులకు సంబంధించిన భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని చెపా-ప్రరు. భూ వివాదాలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను మందలించినట్లు తెలిపారు.

**ఇప్పటికే ప్రజా ప్రభుత్వం తరపున 4.50 లక్షల ఇళ్లు మంజూరు**



## విజయారెడ్డి పిటిషన్ అర్థరహితం..

నేను ఆ కేసు వేసింది కొత్తగా కాదు..
దానంకు విజయారెడ్డి కౌంటర్

ఉపఎన్నికకు ముందు కొత్త ట్విస్ట్

- దానం వర్సెస్ విజయారెడ్డి.. మళ్లీ రగిలిన వివాదం
- ఖైరతాబాద్ ఉపఎన్నికపై నేతల మధ్య మాటల యుద్ధం
- ఎన్నికల పిటిషన్‌పై దానం, విజయారెడ్డి కౌంటర్
- ఖైరతాబాద్ ఉపఎన్నికకు పిటిషన్ అడ్డంకా?
- పిటిషన్‌పై దానం ఫైర్.. విజయారెడ్డి కౌంటర్
- ఉపఎన్నికపై కోర్టు తీర్పు కోసం ఉత్కంఠ

05

## సింగరేణి కార్మికులకు న్యాయం చేయాలి

- మెడికల్ బోర్డును నెలకు రెండుసార్లు నిర్వహించాలి
- పెండింగ్లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వాలి
- సింగరేణికి కొత్త బొగ్గు బ్లాకులు కేటాయించాలి
- ప్రభుత్వ బకాయిలు రూ.62 వేల కోట్లు వెంటనే చెల్లించాలి
- కార్మికుల సమస్యలపై సింగరేణి భవన్ ఎదుట కవిత బైఠాయింపు

03



## ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు

రాయలసీమను రతనాల సీమగా మారుస్తాం..!

- తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- రూ.30 వేల కోట్లతో జలధారకు శ్రీకారం
- 27 లక్షల కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు
- రాయలసీమలో ఇక తాగునీటి కష్టాలు ఉండొద్దు

03



### తాగునీటితో పాటు అభివృద్ధి పథకాల జోరు

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ద్వారా సురక్షితమైన తాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టామని చంద్రబాబు తెలిపారు. జల్ జీవన్ మిషన్ పనులతో రాష్ట్రవ్యాప్తంగా 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు తాగునీటి కుళాయి కనెక్షన్లు అందనున్నాయని చెప్పారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డిని చంద్రబాబు ప్రశంసించారు. 86 ఏళ్ల వయసులోనూ నవ యువకుడిలా

## కేబీఆర్ పార్క్ చుట్టూ శాశ్వతంగా వన్‌వే..

- కేబీఆర్ పార్క్ చుట్టూ ప్రాజెక్టు రీ-అలైన్‌మెంట్‌కు గ్రీన్ సిగ్నల్
- నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు 6 లైన్ల ఫ్లైఓవర్
- రోడ్ నంబర్ 10 నుంచి 12కు అండర్‌పాస్ నిర్మాణం
- కొత్త డిజైన్‌తో రూ.400 కోట్ల వరకు నిధులు ఆదా
- నగర ట్రాఫిక్‌పై జీహెచ్ఎంసీ కొత్త వ్యూహం

02





## సామాన్యుడిపై ధరల భారం..

ప్రభుత్వం నిద్రమత్తులో ఉందా?

- సన్నబియ్యం ధరలు నాలుగు నెలల్లో 25 శాతం పెరిగాయన్న హరీష్ రావు
- రైతుకు గిట్టుబాటు లేదు.. వినియోగదారుడికి అందుబాటు లేదని విమర్శ
- ఉల్లిపాయ, వెల్లుల్లి, పప్పుల ధరలపై ప్రభుత్వాన్ని నిలదీత
- బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలపై తక్షణ తనిఖీలకు డిమాండ్

03



## నేరస్థుల్లో చావు భయం పుట్టించాలి..

నేరం తర్వాత కాదు.. ముందే అడ్డుకోవాలి

- మహిళలకు భద్రత కల్పించడమే లక్ష్యం
- లైంగిక నేరాలపై సుప్రీం కీలక వ్యాఖ్యలు
- పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టాలి
- ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోండి
- కాలేజీల వద్ద భద్రత పెంచాలని సుప్రీం సూచన
- నేరగాళ్లను ట్రాక్ చేయాలని కోర్టు ఆదేశం
- నిర్భయ ఘటనను గుర్తుచేసిన సుప్రీంకోర్టు

05

# కేబీఆర్ పార్క్ చుట్టూ శాశ్వతంగా వన్‌వే..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్‌లోని అత్యంత రద్దీ ప్రాంతమైన కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ట్రాఫిక్ చిక్కులను వదిలించేందుకు చేపట్టిన మౌలిక వసతుల ప్రాజెక్టు రీ-అలైన్‌మెంట్‌కు జీహెచ్ఎంసీ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ రీ-అలైన్‌మెంట్ పనులను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ స్వయంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గతంలో ప్రతిపాదించిన సంక్లిష్టమైన 7 ఫ్లైఓవర్లు, 7 అండర్‌పాస్‌ల ప్రణాళికను మార్చి, దానికి బదులుగా ఒకే ఒక భారీ ఎలివేటెడ్ ఫ్లైఓవర్, ఒక అండర్‌పాస్ నిర్మాణంతో నూతన రీ-అలైన్‌మెంట్‌కు శ్రీకారం చుట్టినట్లు ఆయన వెల్లడించారు.

**నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు 6 లైన్ల ఫ్లైఓవర్**

నూతన ప్రణాళిక ప్రకారం బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 3లోని ముఫ్ఫాకమ్ జా ఇంజనీరింగ్ కాలేజీ, నాగార్జున సర్కిల్ పరిసరాల నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు సుమారు 4.4 కిలోమీటర్ల పొడవునా భారీ ఎలివేటెడ్ ఫ్లైఓవర్‌ను నిర్మించనున్నారు. దీంతో పాటు బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10 నుంచి రోడ్ నెంబర్ 12కు అనుసంధానంగా ఒక అండర్‌పాస్‌ను ఏర్పాటు చేయనున్నారు. రాబోయే రోజుల్లో వాహనాల రద్దీని తట్టుకునేలా ఈ ఫ్లైఓవర్‌ను పూర్తిగా 6 లైన్ల కారిడార్‌గా తీర్చిదిద్దనున్నట్లు కమిషనర్ తెలిపారు.

**శాశ్వతంగా వన్-వే విధివిధానాలు.. రూ.400 కోట్ల నిధుల ఆదా**

కేబీఆర్ పార్క్ చుట్టూ ప్రస్తుతం అమల్లో ఉన్న వన్-వే ట్రాఫిక్ విధానంపై ప్రజల నుంచి అత్యంత సానుకూల స్పందన వచ్చిందని, అందుకే ఈ వన్-వే రూట్‌ను శాశ్వతంగా కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని జీహెచ్ఎంసీ కమిషనర్ స్పష్టం చేశారు. వన్-వే మార్గంలో ఉన్న డివైడర్ల పరిమాణాన్ని తగ్గించి ఆ రహదారిని కూడా పూర్తిగా 6 లైన్ల విస్తీర్ణంలోకి తీసుకురానున్నారు. గతంలో అనుకున్న బహుళ ఫ్లైఓవర్ల స్థానంలో ఈ నూతన రీ-అలైన్‌మెంట్ చేపట్టడం వల్ల ప్రభుత్వానికి సుమారు రూ.400 కోట్ల వరకు నిధుల వ్యయం తగ్గిందని, ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసి నగరవాసులకు అందుబాటులోకి తెస్తామని అధికారులు వివరించారు.

# యూఎస్‌తో ట్రేడ్ డీల్‌లో పీటముడి

**ఢిల్లీ :** అమెరికా, భారత్ మధ్య ట్రేడ్ డీల్ చర్చల్లో పీటముడి పడినట్టే ఉందని ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ అన్నారు. ఒకరకంగా చర్చలు స్తంభించినట్టు కనిపిస్తున్నాయంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. డీల్ ముందుకు సాగే దిశగా ఇరు వర్గాలు అవతలి వారికి మినహాయింపు ఇవ్వడం చాలా కష్టంగా మారిందని అన్నారు. న్యూఢిల్లీలో సోమవారం జరిగిన మ్యూనిచ్ లీడర్స్ మీటింగ్ మంత్రి ఈ కామెంట్స్ చేశారు. ఇరు వర్గాలు రాజీపడతాయా లేదా అన్న దానిపైనే చర్చల్లో పురోగతి ఆధారపడి ఉంటుందని వ్యాఖ్యానించారు. 'చర్చలు అయితే జరుగుతున్నాయి. కానీ డీల్ కోసం అవతలివారికి ఇచ్చే మినహాయింపుల విషయంలో ఇరు వర్గాలకు కష్టంగా కనిపిస్తోంది. అవకాశం ఉంటే భారత్, అమెరికాలు ఈ దిశగా కచ్చితంగా ప్రయత్నిస్తాయి' అని ఆమె అన్నారు.

**సుంకాలు కాదు.. చర్చలే పరిష్కారం..**

అమెరికాతో వాణిజ్యం ఇప్పటికే భారత్‌ను అనుకూలంగానే ఉందని అన్నారు. దీని వల్ల తమకు నష్టం జరుగుతోందని భావిస్తున్న అమెరికా దీన్ని కొంతవరకైనా పూడ్చుకునేందుకు ప్రయత్నిస్తోందని చెప్పారు. డీల్స్‌పై దేశాల మధ్య జరుగుతున్న చర్చల్లో మార్పులు వస్తున్నాయని కూడా మంత్రి అన్నారు. 'సుంకాలు కూడా ఈ చర్చల్లో భాగంగానే ఉండేవి. ఇప్పటికీ ఆ మార్గదర్శకాలు ఉన్నప్పటికీ సుంకాలు కొత్త పథాంలో వెళుతున్నాయని అన్నారు. అయితే, దేశాలకు ఇప్పటికీ చర్చలే మార్గమని ఆమె స్పష్టం చేశారు. ఇచ్చుపుచ్చుకునే మార్గాలను దేశాలు వెతకాలని సూచించారు. వివిధ దేశాలు ప్రస్తుతం ద్వైపాక్షిక ఒప్పందాలపై మొగ్గు చూపుతున్నాయని అన్నారు. ఇలాంటి ఒప్పందాలే ప్రయోజనకరమని పలు దేశాలు భావిస్తున్నట్టు చెప్పారు. పలుదేశాలకు వర్తించే ఒప్పందాలకంటే ద్వైపాక్షిత ఒప్పందాలపై ఆసక్తి వ్యక్తమవుతోందని అన్నారు. భారత్-ఈయూ మధ్య డీల్ కూడా ద్వైపాక్షిక ఒప్పందంగానే తాను పరిగణిస్తానని చెప్పారు.

# 2026 మెడిసిన్ నోబెల్ ప్రైజ్‌ల ప్రకటన..

**ఢిల్లీ :** ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే నోబెల్ బహుమతుల ప్రకటనల పర్వం అధికారికంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా 2026 సంవత్సరానికి గాను వైద్యశాస్త్ర (ఫిజియాలజీ, మెడిసిన్) నోబెల్ బహుమతి విజేతల వివరాలను కరోలిన్స్కా ఇన్స్టిట్యూట్ నోబెల్ అసెంబ్లీ ఇవాళ మధ్యాహ్నం ప్రకటించింది. ఈ ఏడాది ఈ అత్యున్నత పురస్కారం ముగ్గురు ప్రముఖ శాస్త్రవేత్తలను సంయుక్తంగా వరించింది. ఆ జాబితాలో కార్ల్ డైసర్‌రోత్ , పీటర్ హెగెమాన్ , జార్జ్ నాజెల్ ఉన్నారు. 'లైట్-గేటెడ్ అయాన్ ఛానెల్స్, ఆప్టోజెనెటిక్స్ రంగంలో వారు చేసిన అపూర్వమైన, సంచనాత్మక ఆవిష్కరణలకు గాను ఆ ముగ్గురికి వైద్య నోబెల్ బహుమతిని ప్రదానం చేస్తున్నట్లుగా నోబెల్ కమిటీ వెల్లడించింది. ఈ శాస్త్రవేత్తలు కనుగొన్న ఆప్టోజెనెటిక్స్ టెక్నాలజీ ద్వారా.. కాంతిని ఉపయోగించి మెదడులోని నిర్దిష్ట కణాల (న్యూరాన్ల) పనితీరును నియంత్రించడం సాధ్యమైంది. పార్కిన్సన్స్, అల్జీమర్స్ వంటి నాడీ సంబంధిత రుగ్మతలు, డిప్రెషన్, ఇతర మెదడు వ్యాధుల చికిత్సలో ఈ పరిశోధన వైద్య రంగంలో ఓ సరికొత్త విప్లవానికి నాంది పలికిందని నిపుణులు పేర్కొంటున్నారు. మొత్తం ఆరు రంగాలకు సంబంధించిన ఈ ఏడాది నోబెల్ అవార్డుల ప్రకటనలు అక్టోబర్ 5 నుంచి అక్టోబర్ 12 వరకు వరుసగా కొనసాగనున్నాయి.

# ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి



**నల్లగొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** అన్ని స్థాయిలలో ప్రజావాణిలో వొచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన జిల్లా అధికారులతో కలిసి ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల, డివిజన్ స్థాయి ప్రజావాణిలో స్థానిక సంస్థలు, రెవెన్యూ, అంశాలకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదుల పెండింగ్ ఎక్కువగా ఉందని, వీటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, త్వరగా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# ఓటుకు నోటు కేసులో కీలక మలుపు..

**ఢిల్లీ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే ఎన్. స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టు లో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఓటుకు నోటు కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో జరుగుతున్న విచారణలో తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని, తనకూ అదనపు వాదనలు వినిపించే అవకాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ ఈ పిటిషన్‌లో కోరారు. ఈ కేసులో ఫిర్యాదుదారుడిగా, కీలక బాధితుడిగా ఉన్న తన వాదన వినడం న్యాయపరంగా ఎంతో కీలకమని ఆయన తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చినట్లుగా సమాచారం.

**సుప్రీంకోర్టు రియాక్షన్ ఇదే..**

స్టీఫెన్‌సన్ దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. పిటిషన్‌లోని అంశాలను పరిశీలించిన సీజేఐ ధర్మాసనం.. ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణను వాయిదా వేసింది. కాగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత జరిగిన శాసనమండలి ఎన్నికల సమయంలో ఈ 'ఓటుకు నోటు' ఉదంతం వెలుగులోకి వచ్చింది. నామినేటెడ్ ఎమ్మెల్యేగా ఉన్న స్టీఫెన్‌సన్‌ను తమ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేయాలని కోరుతూ.. రేవంత్ రెడ్డి భారీగా నగదు ఆశ చూపారనే ఆరోపణలతో పాటు లావాదేవీలకు సంబంధించి వీడియోలు కూడా బయటకు వచ్చాయి. ఈ కేసుకు సంబంధించి గతంలో ఏసీబీ విచారణ, హైకోర్టులో వివిధ పిటిషన్లు దాఖలు కావడం, రాజకీయంగా తీవ్ర దుమారం రేగడం తెలిసిందే. ప్రస్తుతం ఈ కేసు సుప్రీంకోర్టు విచారణలో ఉండగా, తాజాగా స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# ఫేక్ ఫారం - 7 ఇస్తే సీరియస్ యాక్షన్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా పలు చోట్ల ఫారం-7 పత్రాలు పెద్ద ఎత్తున వెలుగులోకి వస్తుండటం రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ముఖ్యంగా ఇటీవల గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ముషీరాబాద్, బహదూర్ పుర నియోజకవర్గంలోని ప్రీ ప్రింటెడ్ దరఖాస్తులకు సంబంధించిన వీడియోలో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టిన నేపథ్యంలో ఓ వర్గం ఓట్లు టార్గెట్ గా ఫారం-7 దాఖలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ అంశంపై రాష్ట్ర ఎన్నికల సంఘం స్పందించింది. ఓటర్ల నమోదు, సవరణల ప్రక్రియలో తప్పుడు సమాచారంతో నకిలీ దరఖాస్తులు సమర్పించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారులు , రాష్ట్రంలోని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.

**బల్క్ ఫారమ్-7 దరఖాస్తులపై నిఘా**

రాష్ట్రంలో ప్రస్తుతం ఎస్ఐఆర్ ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. ఈ క్రమంలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారుల వద్దకు భారీ సంఖ్యలో ఓట్ల తొలగింపునకు సంబంధించి ఫారమ్-7 బల్క్ దరఖాస్తులు వస్తున్నాయని, అందులో అనేక అప్లికేషన్లు నకిలీవిగా ఆరోపణలు వస్తున్నాయని సీఈఓ కార్యాలయం దృష్టికి వచ్చింది. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన సీఈఓ.. ఓటర్ల జాబితాలో పేర్ల చేర్పులు, మార్పులు లేదా తొలగింపుల కోసం ఫారమ్-6, 6ఎ, 7, 8 ద్వారా ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం లేదా తప్పుడు డిక్లరేషన్ ఇచ్చే అభ్యర్థులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వచ్చిన ఫారం-7 లపై నిబంధనల ప్రకారం ముందస్తు విచారణ జరిపిన తర్వాతే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రాతినిధ్య చట్టం నిబంధనల ప్రకారం తప్పుడు సమాచారం ఇవ్వడం నేరమని, అటువంటి వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలకు మరియు సంబంధిత ఈఆర్వో లకు ఈ సమాచారాన్ని తెలియజేస్తూ తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సీఈఓ ఆదేశించారు.

**ఫారం-7 వెనుక ప్రణాళిక బద్ధమైనకుట్ర!**

సర్‌లో భాగంగా పలు ప్రాంతాల్లో ఎవరి పేర్లు తొలగించాలో పేర్కొంటూ ప్రింటెడ్ ఫారం-7 పత్రాలు లభిస్తుండడం పట్ల రాజకీయ పార్టీల్లో చర్చ జరుగుతోంది. ఓట్లు తొలగించాలని అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ బీఎల్ఓలకు దరఖాస్తులు రావడం, అవి కూడా ఎవరి పేర్లు తొలగించాలో ముందస్తుగా ప్రింట్ చేసిన అప్లికేషన్లు రావడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో అసలు ఈ పత్రాలు ఎక్కడి నుంచి వస్తున్నాయి? వాటిని ఎవరు ప్రింట్ చేస్తున్నారు? బీఎల్‌వోలకు ఎవరు ఇస్తున్నారు? ఈ అప్లికేషన్ల వెనుక ఎవరైనా ప్రణాళిక ఉందా అనే అనుమానాలు రాజకీయ పార్టీల్లో నెలకొంది. ముఖ్యంగా ముస్లిం ఓటర్లు టార్గెట్ గా ఫారం-7 అప్లికేషన్లు వస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఈ వ్యవహారంపై ఎన్నికల అధికారులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయా రాజకీయ పార్టీల నేతలు డిమాండ్ చేస్తున్న వేళ రాష్ట్ర ఎన్నికల సంఘం స్పందించింది.

# రూ.1,200 కోట్ల గోల్‌మాల్..?

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్ల మరమ్మతుల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. తాజాగా.. రిపేర్ల పేరిట జరిగిన గోల్‌మాల్ వెలుగులోకి వచ్చింది. మోటార్ల రిపేర్లకు సంబంధించిన బిల్లుల వ్యవహారంలో అసలు తెరవెనుక ఉండి మొత్తం వ్యవహారాన్ని నడిపించింది ఎవరు ? నాటి అధికారుల పాత్ర ఏమిటి? నిధుల మంజూరులో నిబంధనలు పాటించారా? అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఆ సమయంలో రామగుండం ఈఎన్సీగా పనిచేసిన అధికారే ఈ బిల్లు తయారీలో కీలకంగా వ్యవహరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయనతోపాటు మరో ఈఈ, డిప్యూటీ ఈఈ సైతం ఈ మాయాజాలంలో ముఖ్యులుగా ఉన్నారని తెలిసింది. కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లు 2022 గోదావరి వరదల్లో దెబ్బతిన్న విషయం తెలిసిందే. రిటైనింగ్ వాల్ కూలడంతో మోటార్లు, కంట్రోల్ ప్యానెళ్లు, ఇతర పరికరాలు భారీగా దెబ్బతిన్నాయి. అనంతరం మరమ్మతులు, పునరుద్ధరణ పనుల కోసం భారీగా ఖర్చు చేసినట్టు అప్పట్లో నివేదికలు వెలువడ్డాయి.

**డిప్యూటీ ఈఈ చేతిలోనే అంతా?**

తాజాగా తెరపైకి వస్తున్న ఆరోపణల ప్రకారం.. కన్నెపల్లి మోటార్ల మరమ్మతులకు తొలుత రూ.25 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేసి.. రూ.1,200 కోట్లకు సంబంధించిన ఒకే బిల్లు తయారు చేసిన తీరు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఇంత భారీ మొత్తానికి సంబంధించిన బిల్లు తయారీలో రామగుండం సర్కిల్‌లో అప్పటి నుంచి పనిచేస్తున్న ఆ డిప్యూటీ ఈఈ కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణంగా భారీ విలువైన పనులకు సంబంధించి అనేక స్థాయిలలో సాంకేతిక పరిశీలన, అంచనాల ఆమోదం, పనుల ధ్రువీకరణ, బిల్లుల పరిశీలన వంటి ప్రక్రియలు ఉండాల్సి ఉంటుంది. మరి ఈ వ్యవహారంలో అవన్నీ జరిగాయా? బిల్లును ఎవరు పరిశీలించారు? ఎవరి ఆమోదంతో ముందుకు వెళ్లింది? అనే ప్రశ్నలకు సమాధానాలు తెలియకుండా ఉన్నాయి. ఇంత పెద్ద మొత్తంలో బిల్లు రాసినప్పటికీ సదరు డిప్యూటీ ఈఈపై ఇంతవరకు ఎలాంటి విచారణ చేపట్టకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. సాధారణంగా రూ.50 లక్షల విలువైన పనులకే విజిలెన్స్ విచారణ ఉండాలి. కానీ.. రూ.1,200 కోట్ల పనులు చేస్తే గత ప్రభుత్వం దీనిని ఎందుకు పక్కన పడేసిందనేది ఎవరికీ అర్థం కాని విషయం. ఆ ప్రభుత్వం పట్టించుకోకున్నా కనీసం ఈ ప్రభుత్వం సైతం ఈ వ్యవహారంపై దృష్టి సారించకపోవడం మరింత అనుమానాలకు తావిస్తోంది.

**గుట్టలు గుట్టలుగా సంపాదన..**

ఈ వ్యవహారంలో అప్పటి రామగుండం ఈఎన్సీ, అప్పటి ఈఈ, ప్రస్తుతం క్వాలిటీ కంట్రోల్‌లోనే పనిచేస్తున్న డిప్యూటీ ఈఈ చక్రం తిప్పారని తెలుస్తోంది. వీరిలో ఓ అధికారి ఇప్పటికే ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. పట్టుబడిన సందర్భంలో ఆయన దగ్గర భారీ ఎత్తున డబ్బు వెలుగుచూసింది. ఈ వ్యవహారంలో కీలకం వ్యవహరించిన అప్పటి ఈఎన్సీ మాత్రం ఎప్పుడైతే రాష్ట్రంలో ప్రభుత్వం చేంజ్ అయిందో.. కాళేశ్వరం మీద విచారణ ప్రారంభం అయిందో.. ఆయన అప్పటి నుంచి దేశం విడిచి పారిపోయారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికీ ఆయన అక్కడే ఉండిపోయారని సమాచారం. ఇక ఈ ఇద్దరిలో ఓ అధికారి కొడుకు పెండ్లి ఏకంగా సింగపూర్‌లో జరపడం మరింత విశేషం. కాళేశ్వరంలో దోచిన భారీ డబ్బులతో వ్యవహారాలన్నింటికీ చక్కబెట్టుకున్నారన్న ప్రచారం జరుగుతున్నది. కన్నెపల్లి పంప్‌హౌస్‌ల రిపేర్లలోనూ పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడి దోచుకున్నారన్న టాక్ నడుస్తున్నది. వీరికి అప్పటి నుంచి ఇప్పటివరకు రామగుండం సర్కిల్ పరిధిలోనే పనిచేస్తున్న ఓ డిప్యూటీ ఈఈ పూర్తిస్థాయిలో సహకరించారని తెలుస్తోంది. ఈ వ్యవహారంలో ఓ అడ్వయిజర్ పేరు సైతం ఇప్పుడు చర్చకు వస్తున్నది. గత ప్రభుత్వంలో అడ్వయిజర్‌గా కొనసాగిన ఆయన.. ఈ ప్రభుత్వంలోనూ కొనసాగుతున్నారని సమాచారం. సదరు అడ్వయిజర్ కూతురుకు ఎప్పటి నుంచో ఓ ఏజెన్సీ ఉన్నది. మోటార్లకు సంబంధించిన వ్యవహారాలన్నీ ఈ ఏజెన్సీ ద్వారానే నడిచినట్టు సమాచారం. సంబంధిత పరీక్షలు, కొత్త వాటి కొనుగోలుకు సంబంధించి ఏజెన్సీ నుంచే నివేదిక ఇప్పించి ఈ తతంగానికి తెరలేపినట్టు తెలిసింది.

**అందరూ కలిసే పంచుకున్నారా?**

ఒకే వ్యవహారంలో మాజీ ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, బిల్లు తయారు చేసిన అధికారులు, బయట నుంచి సలహాలు ఇచ్చిన వ్యక్తులు.. ఇలా పలువురి పేర్లు వినిపిస్తుండటంతో అసలు డబ్బు ఎక్కడికి వెళ్లిందనే చర్చ మొదలైంది. నిధుల మంజూరు నుంచి బిల్లు క్లియరెన్స్ వరకు ఒక వ్యవస్థగా పనిచేశారా? ఎవరికెంత ప్రయోజనం కలిగింది? అన్న కోణంలో సమగ్ర విచారణ జరిగితేనే నిజాలు బయటపడే అవకాశం ఉన్నది. సంబంధిత రికార్డులు, బిల్లులు, ఫైల్ నోట్లు, సాంకేతిక అనుమతులు, చెల్లింపుల వివరాలను పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి తేలుతుంది. కన్నెపల్లి పంప్‌హౌస్ దెబ్బతిన్న సమయంలో తొలుత నష్టం కేవలం రూ.25 కోట్ల స్థాయిలోనే ఉన్నదని ప్రభుత్వం తరఫున ప్రకటనలు వచ్చాయి. తర్వాత డీవాటరింగ్ పూర్తయ్యాక నష్టం భారీగా ఉన్నట్లు వెల్లడైంది. 17 మోటార్లలో 11 మోటార్ల మరమ్మతులు, ఆరు మోటార్లకు కొత్తగా ఆర్డర్లు వంటి అంశాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో మొదటి అంచనాలకు, తర్వాత జరిగిన వ్యయానికి మధ్య భారీ వ్యత్యాసం ఎందుకు వచ్చిందనే ప్రశ్న అప్పటినుంచే ఉన్నది. ఇప్పుడు బిల్లుల వ్యవహారంపై కొత్త ఆరోపణలు రావడంతో ఆ ప్రశ్నలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది.

**ఈ ప్రభుత్వమూ ఎందుకు తేల్చడం లేదు?**

ప్రభుత్వాలు మారినా కన్నెపల్లి మరమ్మతుల బిల్లుల వ్యవహారంలో పూర్తిస్థాయి స్పష్టత రాకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కన్నెపల్లి మోటార్ల రిపేర్లకు సంబంధించిన బిల్లులు పరిశీలనలో ఉన్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ఈ అంశంపై పూర్తి వివరాలు ప్రజల ముందుకు రాలేదని కూడా నివేదికలు పేర్కొన్నాయి. అయితే.. అసలు ఈ పంపుల మరమ్మతుకు రూ.1,200 కోట్లు ఖర్చు చేశారని ఇప్పటివరకు ప్రభుత్వంలోని పెద్దలకు సైతం తెలియకుండా ఉండడం మరింత ఆశ్చర్యానికి గురి చేసే అంశం. అయితే.. రూ.1,200 కోట్ల బిల్లు ఎందుకు అయింది? బిల్లును ఎవరు తయారు చేశారు? ఎవరు పరిశీలించారు? ఎవరి సిఫార్సుతో నిధులు విడుదలయ్యాయి? మాజీ ఈఎన్సీ, ఈఈ, డిప్యూటీ ఈఈ పాత్ర ఎంత? ప్రభుత్వ ఖజానాపై పడిన అసలు భారం ఎంత? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం రావాలంటే కన్నెపల్లి మోటార్ల మరమ్మతులపై స్వతంత్ర సాంకేతిక, ఆర్థిక విచారణ జరిపి పూర్తి వివరాలను ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉన్నదన్న డిమాండ్ ప్రధానంగా వినిపిస్తున్నది.



# భూదార్ పేరుతో పాస్ పుస్తకాలు

**ఆదిలాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో భూ సర్వేను చేపడుతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో సమీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. రెవెన్యూ, సర్వే, హౌసింగ్, రిజిస్ట్రేషన్ శాఖల పనితీరుపై సమీక్షలు నిర్వహిస్తున్నామని మంత్రి వెల్లడించారు. సుమారు 120 ఏళ్ల క్రితం రాష్ట్రంలో భూ సర్వే జరిగిందని, ప్రస్తుతం మళ్లీ మూడు విడతల్లో భూ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మొదటి విడత సర్వే కొనసాగుతోందన్నారు. భూ సర్వే కీలకమైన అంశమని, ఆర్థిక భారం ఉన్నప్పటికీ ప్రభుత్వం సర్వేను చేపడుతోందని మంత్రి పేర్కొన్నారు. ఏడాదిన్నరలోపు భూ సర్వేను పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. సర్వే అనంతరం ప్రతి భూమికి ఎల్‌పీఎం నంబర్ కేటాయించి, 'భూదార్' పేరుతో పాస్ పుస్తకాలు అందించే ప్రక్రియ చేపడతామని చెప్పారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గిరిజనులు, గిరిజనేతరులకు సంబంధించిన భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. భూ వివాదాలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను మందలించినట్లు తెలిపారు.

**రెండో విడతలో ఇళ్లు**

రాష్ట్రంలో గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలపై నిర్వహించిన పరిశీలనలో సుమారు 73 వేల ఇళ్లు/గుడిసెలు ఉన్నట్లు గుర్తించామని మంత్రి తెలిపారు. వీటిలో అర్హులైన వారికి రెండో విడతలో ఇళ్లను మంజూరు చేస్తామని చెప్పారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఇప్పటివరకు 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని, రాష్ట్రంలో ఇప్పటివరకు మొత్తం 8 లక్షల ఇళ్లను అందించినట్లు మంత్రి వెల్లడించారు. రాబోయే దసరా నాటికి మరో 2 లక్షల ఇళ్లను పూర్తి చేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరో రెండు విడతల్లో ఇళ్లను మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి 7730032999 flashindiadaily@gmail.com

# ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు



**కొత్తపల్లి,ఫ్లాష్ ఇండియా :** కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గం నుంచి రాష్ట్రవ్యాప్తంగా జల్ జీవన్ మిషన్ 2.0 అమరజీవి జలధార పనులకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారు. కొత్తపల్లి గ్రామంలో పైలాన్‌ను ఆవిష్కరించిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు పలు కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా రూ.30,156 కోట్లతో పనులు చేపడుతున్నామని తెలిపారు.

**27 లక్షల కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు**

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ద్వారా సురక్షితమైన తాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టామని చంద్రబాబు తెలిపారు. జల్ జీవన్ మిషన్ పనులతో రాష్ట్రవ్యాప్తంగా 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు తాగునీటి కుళాయి కనెక్షన్లు అందనున్నాయని చెప్పారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డిని చంద్రబాబు ప్రశంసించారు. 86 ఏళ్ల వయసులోనూ నవ యువకుడిలా పనిచేస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వాన్ని ఓడించి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడంలో ప్రజలు కీలక పాత్ర పోషించారని అన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ఇప్పటికే బలమైన పునాదులు వేశామని చెప్పారు.

**ఏడు రోజుల్లో తొమ్మిది కార్యక్రమాలు**

తాను, తన మిత్రుడు పవన్ కళ్యాణ్ కలిసి ఏడు రోజుల్లో తొమ్మిది సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించామని చంద్రబాబు తెలిపారు. మదనపల్లిలో లక్ష కోట్ల రూపాయలతో హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు పునాదులు వేశామని, దీనివల్ల రాయలసీమ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందని అన్నారు. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి కోసం రూ.30 వేల కోట్లతో చేపడుతున్న కార్యక్రమానికి ప్రొద్దుటూరు నుంచి శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందని చెప్పారు.

**ప్రతి ఇంటికీ ఇల్లు.. ఇంటిపై సోలార్**

మరోవైపు ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఉండాలని, ప్రతి ఇంటిపై సోలార్ వ్యవస్థ ఉండాలన్నదే తమ లక్ష్యమని చంద్రబాబు తెలిపారు. ప్రతి కుటుంబానికి సెల్‌ఫోన్ ఉంటే ప్రభుత్వ సేవలను ఇంటి నుంచే పొందేలా వాట్సాప్ ద్వారా అన్ని సేవలను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. దేశంలోని 23 ఐఐటీలను అనుసంధానం చేస్తూ పాన్-ఐఐటీ బోర్డు కౌన్సిల్‌ను అమరావతిలో ఏర్పాటు చేశామని చంద్రబాబు తెలిపారు.

**'అమరజీవి జలధార'**

ప్రజలు తాగునీరు తాగిన ప్రతిసారీ పొట్టి శ్రీరాములును గుర్తు చేసుకోవాలనే ఉద్దేశంతో ఈ పథకానికి 'అమరజీవి జలధార' అనే పేరు పెట్టినట్లు చంద్రబాబు తెలిపారు. తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం 2019లో ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనే లక్ష్యంతో జల్ జీవన్ మిషన్‌ను ప్రారంభించిందని చంద్రబాబు గుర్తుచేశారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో తాగునీటి పథకాలకు కేవలం రూ.2,600 కోట్లే ఖర్చు చేసిందని ఆయన ఆరోపించారు. దీనిపై గత పాలకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**రాయలసీమ ఇక కరువు సీమ కాదు**

రాయలసీమ ఒకప్పుడు కరువు సీమగా ఉండేదని, ఇప్పుడు రతనాల సీమగా మారుతోందని చంద్రబాబు అన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతోనే ఈ మార్పు సాధ్యమైందని పేర్కొన్నారు. గోదావరి, కృష్ణా నదులను అనుసంధానం చేసి తన చేతుల మీదుగా జలహారతి ఇస్తానని చెప్పారు. గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును ప్రారంభించి, ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని చంద్రబాబు తెలిపారు.

**అధికారులకు హెచ్చరిక**

కడప జిల్లాలోని అధికారులకు చంద్రబాబు కీలక సూచనలు చేశారు. ప్రజలకు సేవలు అందించడంలో వెనకబడుతున్న అధికారులు తమ పనితీరును సరిదిద్దుకోవాలని హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. వైఎస్సార్‌సీపీపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగినట్లు తాను ఆరోపిస్తున్న వివిధ వ్యవహారాలపై ప్రశ్నలు సంధించారు. లిక్కర్ స్కామ్‌లో వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపిస్తూ.. ఇందులో అంతిమ లబ్ధిదారు ఎవరో తేలిపోయిందని అన్నారు. దీనిపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రొద్దుటూరు వేదికగా ప్రశ్నిస్తున్నానని, ధైర్యం ఉంటే సమాధానం చెప్పాలని చంద్రబాబు సవాల్ చేశారు. వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావడమే తమ కూటమి లక్ష్యమని అన్నారు. తమపై ఆరోపణలు చేసే ముందు గత ప్రభుత్వ హయాంలో జరిగిన పరిణామాలను గుర్తు చేసుకోవాలని చంద్రబాబు వ్యాఖ్యానించారు. హింసాత్మక రాజకీయాలే గత పాలకుల సిద్ధాంతమని ఆరోపించారు. వివేకానందరెడ్డి హత్య నుంచి లిక్కర్ స్కామ్ వరకు పలు అంశాలను ప్రస్తావిస్తూ గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఇంకా రాయలసీమకు, కడప జిల్లాకు గత ప్రభుత్వం ఏం చేసిందో చెప్పే ధైర్యం ఉందా? అని చంద్రబాబు ప్రశ్నించారు. తాను కూడా రాయలసీమ బిడ్డనేనని, ఇక్కడే పుట్టి, ఇక్కడి నీటినే తాగానని అన్నారు. రాయలసీమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు సాగునీరు, రహదారులు, పరిశ్రమలు, సంక్షేమం, డిజిటల్ సేవల ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు పేర్కొన్నారు.

# ప్రభుత్వ విద్యకు పెద్దపీట రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం





**పెద్దపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను భారీగా అభివృద్ధి చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఎలిగేడు మండలం రాములపల్లె వద్ద రూ.200 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను సోమవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ.. కుల, మత భేదాలకు అతీతంగా అన్ని వర్గాల విద్యార్థులు ఒకే వేదికపై నాణ్యమైన విద్యను అభ్యసించేలా ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన రెండున్నరేళ్లలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.70 కోట్ల నిధులు మంజూరు చేయించి పాఠశాల భవనాలు, మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు తదితర మౌలిక వసతులను కల్పించినట్లు చెప్పారు. రాములపల్లెలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలలో సుమారు 2,560 మంది విద్యార్థులకు విద్య అందించడంతో పాటు హాస్టల్, క్రీడా మైదానం, డైనింగ్ హాల్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా పాఠశాలను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం అందిస్తున్నట్లు తెలిపారు. వారానికి మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగిజావ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మౌలిక వసతులు అందుబాటులోకి వస్తున్నాయని విజయరమణారావు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో చిన్నారుల విద్యకు భారీగా ఖర్చు చేయాల్సి వస్తోందని, అదే స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా నాణ్యమైన విద్య లభిస్తుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆయన విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తూ కోట్లాది రూపాయల నిధులతో పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, సింగిల్ విండో చైర్మన్ సామ రాజేశ్వర్ రెడ్డి , డైరెక్టర్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, వెంకటేష్ గౌడ్, సిద్ధి తిరుపతి, కొమురయ్య వెంకట్ రెడ్డి ఉప సర్పంచ్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ రాష్ట్ర యువజన నాయకులు దుగ్యాల సంతోష్ రావు,కాంగ్రెస్ నాయకులు పోల్సాని పుల్లారావు , మేచినేని వంశీకృష్ణ రావు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ హైకోర్టు సీజేకు పదోన్నతి..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ పదోన్నతిపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ నుంచి అధికారికంగా నోటిఫికేషన్ వెలువడింది. న్యాయ వ్యవస్థలో ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తించి, కొలీజియం సిఫారసుల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ఈ నియామక ప్రక్రియను పూర్తి చేసింది. అయితే, ప్రస్తుతానికి హైకోర్టు యాక్టింగ్ సీఏజేగా శ్యామ్ కోశాయి వ్యవహరించనున్నారు.

**రాష్ట్రపతి భవన్ నోటిఫికేషన్..**

జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టు జడ్జిగా నియామకం ఖరారైనట్లుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కార్యాలయం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర హైకోర్టులో ఆయన చేపట్టిన పలు కీలక తీర్పులు, పరిపాలనా సంస్కరణలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పదోన్నతి పొందిన జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ త్వరలోనే సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

# విద్యా కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. డిసెంబర్ 2027 నాటికి 67 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను పూర్తి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం, ఫ్యూచర్ సిటీలో విద్యాసంస్థల ఏర్పాటుపై సీఎస్ సంజయ్ జాజు ఈరోజు (సోమవారం) సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై అధికారులకు సీఎస్ దిశానిర్దేశం చేశారు. జూన్ 2028 నాటికి 87 స్కూళ్ల ఏర్పాటుకు ప్రణాళిక చేస్తున్నామని తెలిపారు.

**దశలవారీగా యంగ్ ఇండియా స్కూళ్లు ఏర్పాటు..**

రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో దశలవారీగా యంగ్ ఇండియా స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు సీఎస్ వెల్లడించారు. ఒక్కో స్కూల్‌కు సుమారు 26 ఎకరాల్లో ఆధునిక మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఒకే క్యాంపస్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. క్రీడా మైదానాలు, హాస్టళ్లు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఫ్యూచర్ సిటీలో విదేశీ యూనివర్సిటీల క్యాంపస్‌లకు ప్రత్యేక విధానం తీసుకువస్తామని చెప్పారు. ఇందుకోసం లండన్, బర్మింగ్‌హామ్ యూనివర్సిటీలతో పాటు మరో 4 విదేశీ వర్సిటీలు ఆసక్తి చూపిస్తున్నాయని సీఎస్ వివరించారు. విదేశీ వర్సిటీలకు మౌలిక వసతులు, పెట్టుబడులు, అనుమతులపై సమగ్ర విధానం ప్రవేశపెడతామని అన్నారు. గ్లోబల్ సమ్మిట్ నాటికి స్పష్టమైన కార్యాచరణ, ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు.

# పార్టీ ఆఫీస్ చుట్టూ తిరగడం కాదు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో అధికారమే లక్ష్యంగా బీజేపీ పార్టీ పావులు కదుపుతున్న వేళ.. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఇవాళ నిర్వహించిన పదాధికారుల సమావేశం తీవ్ర వాడీవేడిగా సాగింది. పార్టీ నాయకుల పనితీరుపై తెలంగాణ వ్యవహారాల సహ ఇన్ చార్జి అభయ్ పాటిల్, రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి మధుకర్ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో అభయ్ పాటిల్ మాట్లాడుతూ.. క్రియాశీల సభ్యత్వం లేని వారకి రాష్ట్ర స్థాయి బాధ్యతలు ఇచ్చారని నేతల తీరుపై అభయ్ పాటిల్ క్లాస్ తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇకపై మేనేజ్ చేసుకుని పదవులు తెచ్చుకోవడం కుదరదని, బీజేపీ ఆఫీస్ చుట్టూ తిరగడం మాని జిల్లాల్లో పని చేయాలని నేతలకు సూచించారు. తాను వెళ్లిపోతానని కొందరు సంబరాలు చేసుకున్నారని కానీ పూర్తి అధికారాలతో వచ్చానని చెప్పుకొచ్చినట్లు తెలుస్తోంది.

**పార్టీ నిధుల దుర్వినియోగంపై..**

పార్టీ నిధుల దుర్వినియోగంపై అభయ్ పాటిల్ సీరియస్ అయినట్లు తెలుస్తోంది. గత మున్సిపల్ ఎన్నికల డబ్బులు నేతలు వాడుకున్నారని, ఎన్నికల్లో అభ్యర్థులకు మొత్తం డబ్బులు ఇవ్వలేదని సీరియస్ అయినట్లు సమాచారం. పార్టీ డబ్బులు దుర్వినియోగం చేసిన వారిపై కేసులు పెట్టి జైలుకు పంపిస్తానని ఎవరెవరి వెనుక ఎవరున్నారో కూడా తెలుసని ఎవ్వరినీ వదిలిపెట్టేది లేదని హెచ్చరించినట్లు తెలుస్తోంది.

**ఏసీ రూముల్లో కూర్చుంటే పదవులు ఊడతాయి: మధుకర్**

మరోవైపు సంస్థాగత ప్రధాన కార్యదర్శి మధుకర్ కూడా నేతల తీరుపై మండిపడినట్లు సమాచారం. పదవులు పొందిన తర్వాత హైదరాబాద్‌కే పరిమితమై ఏసీ రూముల్లో కూర్చుంటే సరిపోదని జిల్లాల్లో ఉండాలని చెప్పినట్లు తెలుస్తోంది. తమ పరిధిలోని జిల్లాల్లో అందుబాటులో ఉంటూ పార్టీని బలోపేతం చేయకపోతే కఠిన నిర్ణయాలు ఉంటాయని హెచ్చరించినట్లు తెలుస్తోది. ఈ సమావేశం ఇంకా కొనసాగుతోంది.

# సామాన్యుడిపై ధరల భారం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతూ సామాన్య పౌరుడి నడ్డి విరుస్తుంటే, వాటిని అదుపు చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు హరీష్ రావు విమర్శించారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై విరుచుకుపడిన ఆయన, పౌరసరఫరాల శాఖ పర్యవేక్షణా రాహిత్యానికి సామాన్య ప్రజలే మూల్యం చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే సన్నబియ్యం ధరలు ఏకంగా 25 శాతం పెరగడం ప్రభుత్వ వైఫల్యానికి స్పష్టమైన నిదర్శనమని మండిపడ్డారు. రికార్డు స్థాయిలో పంట దిగుబడి సాధించామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, ఉత్పత్తి పెరిగినప్పుడు మార్కెట్లో బియ్యం ధరలు ఎందుకు ఆకాశాన్ని అంటుతున్నాయో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ప్రభుత్వం రేషన్ ద్వారా ఇస్తున్న నాణ్యత లేని సన్నబియ్యాన్ని ప్రజలు వినియోగించడం లేదనడానికి, బయట మార్కెట్లో బియ్యం ధరలు అదుపు తప్పడమే ప్రధాన సాక్ష్యమని వ్యాఖ్యానించారు.

**రైతుకు గిట్టుబాటు లేదు.. వినియోగదారుడికి అందుబాటు లేదు**

ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతన్నకు మద్దతు ధర పేరిట నామమాత్రపు ధర మాత్రమే దక్కుతుంటే, మధ్యదళారులు మాత్రం క్వింటాకు రూ.8,000 పైమాటే లాభపడుతున్నారని హరీష్ రావు ఆరోపించారు. రైతుకు గిట్టుబాటు ధర దక్కక, ఇటు వినియోగదారుడికి అందుబాటు ధరలో సరుకులు అందక తీవ్ర అవస్థలు పడుతుంటే కేవలం మధ్యవర్తులు మాత్రమే కోట్లు కొల్లగొడుతున్నారని ధ్వజమెత్తారు. కళ్లముందే ఈ దోపిడీ జరుగుతున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం శోచనీయమన్నారు. బియ్యం మాత్రమే కాకుండా ఉల్లిపాయలు రూ.70, వెల్లుల్లి రూ.240, పల్లి నూనె రూ.210, పెసరపప్పు రూ.125, కందిపప్పు రూ.165 కు చేరుకోవడంతో సామాన్య కుటుంబాల వంటింటి బడ్జెట్ పూర్తిగా తలకిందులైందని తెలిపారు.

**బ్లాక్ మార్కెటింగ్‌పై తక్షణమే దాడులు చేయాలని డిమాండ్**

ధరల పర్యవేక్షణను గాలికి వదిలేసి ప్రభుత్వం కేవలం ప్రేక్షక పాత్ర పోషిస్తోందని హరీష్ రావు మండిపడ్డారు. వ్యాపారులు సృష్టిస్తున్న కృత్రిమ కొరత, అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్ , అధిక మార్జిన్లపై తక్షణమే తనిఖీలు నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకుని సన్నబియ్యం సహా అన్ని నిత్యావసరాల ధరలకు అడ్డుకట్ట వేసి, పెరుగుతున్న ధరల భారం నుంచి సామాన్యుడికి ఉపశమనం కల్పించాలని ఆయన స్పష్టం చేశారు.

# భూమిలోపల సంపదపై పడ్డారు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** భూములు దోచుకోవడం అయిపోయింది.. ఇప్పుడు భూముల లోపల ఉన్న సంపద దోచుకొని, వారసత్వ కట్టడాలను కూల్చడానికి రేవంత్ సర్కార్ కుట్రలు పన్నుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలుగు రాష్ట్రాల్లో యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా పొందిన ఏకైక చారిత్రక కట్టడం రామప్ప దేవాలయం సమీపంలో ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ఏర్పాటు చేసేందుకు సింగరేణి సంస్థ సన్నాహాలు చేస్తోందన్న వార్తలపై కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

**వారసత్వ సంపదకు ముప్పు:**

రామప్ప దేవాలయానికి అతి సమీపంలో ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవడం దారుణం అని కేటీఆర్ అన్నారు. మీటర్ల కొద్ది లోతులో తవ్వకాలు, బ్లాస్టింగ్స్ చేయడం వల్ల తెలంగాణ శిల్పకళకు ప్రతిరూపం, యునెస్కో ద్వారా ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి, రామప్ప చెరువుకు తీవ్ర ముప్పు వాటిల్లనుందని ఆందోళన వ్యక్తం చేశారు. వారసత్వ సంపదను ధ్వంసం చేసే ఈ కుట్రలను బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకిస్తుందని ప్రఖ్యాత రామప్ప దేవాలయానికి హాని చేసే ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ప్రతిపాదనను వెంటనే వెనక్కి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# సింగరేణి కార్మికులకు న్యాయం చేయాలి

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సింగరేణి కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఖైరతాబాద్లోని సింగరేణి భవన్ ఎదుట కవిత పార్టీ నాయకులు, కార్యకర్తలు, హెచ్ఎంఎస్ నాయకులతో కలిసి బైఠాయించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. కార్మికుల సమ స్యలపై తెలంగాణ రక్షణ సేన, హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సింగరేణి కార్మికులకు న్యాయం జరిగే వరకు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. సింగరేణి సాధించిన లాభాల్లో కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని కవిత డిమాండ్ చేశారు. 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వాస్తవ లాభాలను వెల్లడించి, కార్మికులకు లాభాల వాటాను వెంటనే చెల్లించాలని కార్మిక సంఘాల నుంచి కూడా డిమాండ్లు వస్తున్నాయి.

**మెడికల్ బోర్డుపై డిమాండ్లు..**

మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులందరినీ వైద్య పరీక్షల అనంతరం అన్ఫిట్గా ప్రకటించి, వారి ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా న్యాయం చేయాలని కవిత కోరారు. మెడికల్ బోర్డులను నెలకు రెండుసార్లు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇటీవల నిర్వహిస్తున్న మెడికల్ బోర్డుల్లో కొద్దిమంది కార్మికులను మాత్రమే అన్ఫిట్గా ప్రకటిస్తున్నారని కవిత గతంలో ఆరోపించారు. అలియాస్ పేర్లతో ఎదురవుతున్న కార్మికుల సమ స్యలను పరిష్కరించాలని, జూనియర్ అసిస్టెంట్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఆమె కోరారు. విజిలెన్స్ పేరుతో నిలిపివేసిన డిపెండెంట్ ఉద్యోగాలను కూడా వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిపెండెంట్ ఉద్యోగాలు కార్మికుల హక్కు అని కవిత గతంలో పేర్కొన్నారు.

**ప్రతి కార్మికుడికి ఇంటి స్థలం..**

సింగరేణి కార్మికుల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రతి కార్మికుడికి రెండు గుంటల భూమి ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. కార్మికులు తమ సేవా కాలంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిగణనలోకి తీసుకుని వారికి గృహ భద్రత కల్పించాలని కోరారు.

**కొత్త బొగ్గు బ్లాకులు కేటాయించాలి..**

సింగరేణి సంస్థకు కొత్త బొగ్గు బ్లాకులు కేటాయించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. సంస్థకు తగిన బొగ్గు వనరులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సింగరేణి కార్మి కులపై ఆదాయపు పన్ను భారాన్ని తొలగించాలని కవిత డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులకు హై పవర్ కమిటీ సిఫార్సుల మేరకు వేతనాలు చెల్లించాలని కోరారు. శాశ్వత కార్మికులతో సమానంగా కాంట్రాక్టు కార్మికుల సమస్యలను కూడా పరిష్కరించాల్సిన అవసరం ఉందని అన్నారు. సింగరే ణికి ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.62 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కవిత డిమాండ్ చేశారు. సంస్థ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తన బకాయిలను చెల్లించాలని కోరారు.

## సంపాదకీయం




# ప్రపంచానికి పెను ముప్పు

మన చుట్టూ కనిపించని ఎన్నో ప్రమాదాలు ఉంటాయి. వాటిలో కొన్ని మన కళ్లకు కనిపించకపోయినా, మన శరీరంలోకి చేరి సంవత్సరాల పాటు ప్రభావం చూపుతాయి. పాదరసం కాలుష్యం కూడా అలాంటి నిశ్శబ్ద ప్రమాదమే. గాలి, నీరు, నేలతో పాటు ఆహారపు గొలుసులోకి చేరుతున్న పాదరసం చివరకు మనిషి ఆరోగ్యాన్నే దెబ్బతీస్తుంది. అందుకే పాదరసం కాలుష్యం ఒక్క దేశానికి సంబంధించిన సమస్య కాదు. ఇది మొత్తం భూగోళాన్ని పట్టిపీడిస్తున్న అంతర్జాతీయ సమస్య. ఈ ప్రమాదంపై ప్రపంచ దేశాలు ఇక ఆలస్యం చేయకుండా కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఐఐటీ వేదికగా ప్రపంచ శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు, విధాన రూపకర్తలు ఒకచోట చేరడం ప్రాధాన్యత సంతరించుకుంది. అక్టోబర్ 4 నుంచి 9 వరకు జరుగుతున్న 17వ అంతర్జాతీయ సదస్సు పాదరసం కాలుష్యంపై ప్రపంచ స్థాయి చర్చకు వేదికగా మారింది. సుమారు 26 దేశాల నుంచి నిపుణులు, పరిశోధకులు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు హాజరై ఈ సమస్యపై చర్చించడం చూస్తే పాదరసం కాలుష్యం ఎంత తీవ్రమైన స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు. మూడు దశాబ్దాలకు పైగా చరిత్ర ఉన్న ఈ సదస్సు భారత్‌లో తొలిసారి జరగడం కూడా మన దేశానికి దక్కిన ప్రత్యేక గుర్తింపుగా చెప్పుకోవచ్చు. అయితే ఇలాంటి సదస్సులు నిర్వహించడం, శాస్త్రవేత్తలు సమావేశమై పరిశోధనలను పంచుకోవడం మాత్రమే సరిపోదు. అసలు ప్రశ్న ఏమిటంటే.. ఈ చర్చల నుంచి సామాన్య ప్రజలకు ఏమి అందుతుంది? పాదరసం కాలుష్యం తగ్గించేందుకు ప్రభుత్వాలు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటాయి? కాలుష్యానికి కారణమయ్యే పరిశ్రమలు, వ్యాపారాలు, సంప్రదాయ పద్ధతులపై ఎంతవరకు నియంత్రణ ఉంటుంది? ఇవే ప్రజలు తెలుసుకోవాల్సిన అంశాలు. పాదరసం ఎక్కడి నుంచి వస్తుందో కూడా మనం అర్థం చేసుకోవాలి. కొన్ని పరిశ్రమల నుంచి వెలువడే ఉద్గారాలు, చిన్న తరహా బంగారు తవ్వకాల్లో ఉపయోగించే పద్ధతులు, చమురు--సహజవాయు రంగాల నుంచి వెలువడే కాలుష్యం, కొన్ని సౌందర్య సాధనాల్లో పాదరసం వినియోగం వంటి అనేక మార్గాల ద్వారా ఇది పర్యావరణంలోకి చేరుతోంది. ఒకసారి పర్యావరణంలోకి చేరిన తర్వాత గాలి, నీరు, నేల ద్వారా దాని ప్రభావం విస్తరిస్తుంది. చివరకు మనం తినే ఆహారంలోకి కూడా చేరే ప్రమాదం ఉంటుంది. ఇక్కడే సామాన్య ప్రజల ఆందోళన మొదలవుతుంది. మనం తాగే నీరు సురక్షితమేనా? మనం తినే ఆహారంలో హానికరమైన లోహాలు ఉన్నాయా? పిల్లల ఆరోగ్యంపై వీటి ప్రభావం ఎంత? గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు వంటి సున్నిత వర్గాలను రక్షించేందుకు ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు ఏమిటి? ఇలాంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఉండాలి. పర్యావరణ కాలుష్యం పెరుగుతున్న సమయంలో ఆరోగ్య పరిరక్షణను కేవలం ఆసుపత్రులు, వైద్య సేవలకే పరిమితం చేయలేం. కాలుష్యం మూలాలను నియంత్రించడమే అసలు ప్రజారోగ్య విధానంగా మారాలి. పాదరసం విష ప్రభావంపై ప్రపంచానికి ఇప్పటికే చాలా శాస్త్రీయ ఆధారాలు అందుబాటులో ఉన్నాయి. గత మూడు దశాబ్దాలుగా పాదరసం గాలి, నీరు, నేలలో ఎలా ప్రయాణిస్తుంది, ఆహారపు గొలుసులో ఎలా చేరుతుంది, మానవ ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది అనే అంశాలపై విస్తృత పరిశోధనలు జరిగాయి. అంటే ఇప్పుడు మన దగ్గర సమాచారం లేదని చెప్పడానికి అవకాశం లేదు. సమస్య పరిశోధనల కొరతలో కాదు.. ఆ పరిశోధనలను ప్రభుత్వ విధానాలుగా మార్చడంలో ఉంది. ఇదే ఈ సదస్సు మనకు గుర్తు చేస్తున్న ముఖ్యమైన విషయం. శాస్త్రవేత్తలు ప్రయోగశాలల్లో పరిశోధనలు చేస్తే సరిపోదు. ఆ పరిశోధనల ఫలితాలు ప్రభుత్వ కార్యాలయాలకు చేరాలి. అక్కడి నుంచి చట్టాలు, నియంత్రణలు, పర్యవేక్షణ వ్యవస్థలు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలుగా మారాలి. లేకపోతే ఎన్నో అంతర్జాతీయ సదస్సులు జరిగినా, వాటి ఫలితం కాగితాలకే పరిమితమవుతుంది. మరో సున్నితమైన అంశం సంప్రదాయ వైద్యం. ఆయుర్వేదం పేరుతో కొన్ని చోట్ల పాదరసం, సీసం వంటి లోహాల వినియోగంపై కూడా చర్చ అవసరం. సంప్రదాయ వైద్య విధానాలను గౌరవించడమే కాకుండా, వాటిలో ఉపయోగించే పదార్థాలు శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా? వాటి తయారీ, మోతాదు, నాణ్యతపై సరైన పర్యవేక్షణ ఉందా? అన్నది కూడా పరిశీలించాలి. ప్రజల విశ్వాసాన్ని కాపాడటం ఎంత ముఖ్యమో, వారి ఆరోగ్యాన్ని కాపాడటం అంతకంటే ముఖ్యం. అలాగే సౌందర్య సాధనాల విషయంలోనూ ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. చర్మాన్ని తెల్లగా చేస్తామని, అందాన్ని పెంచుతామని చెప్పే కొన్ని ఉత్పత్తుల్లో హానికరమైన పదార్థాలు ఉండే అవకాశం ఉంది. ఇలాంటి ఉత్పత్తులపై మార్కెట్ పర్యవేక్షణ కఠినంగా ఉండాలి. వినియోగదారులకు కూడా ఉత్పత్తుల లేబుళ్లు చదివే అలవాటు రావాలి. చౌకగా దొరికిందని, త్వరగా ఫలితం వస్తుందని తెలియని ఉత్పత్తులను ఉపయోగించడం ప్రమాదకరమని ప్రజలకు అవగాహన కల్పించాలి. చిన్న తరహా బంగారు తవ్వకాలు కూడా మరో పెద్ద సవాలు. ఉపాధి కోసం జరిగే ఈ కార్యకలాపాల్లో పాదరసం వినియోగం ఉంటే, దాని ప్రభావం కార్మికులకే కాకుండా వారి కుటుంబాలకు, స్థానిక నీటి వనరులకు, నేలకు కూడా చేరవచ్చు. అందువల్ల పర్యావరణ పరిరక్షణ పేరుతో పేదల ఉపాధిని దెబ్బతీయడం కాకుండా, వారికి సురక్షితమైన ప్రత్యామ్నాయ సాంకేతికతలు అందించడం ప్రభుత్వాల బాధ్యత. మరోవైపు కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ వంటి ఆధునిక సాంకేతికతలను పాదరసం కాలుష్యాన్ని గుర్తించేందుకు, అంచనా వేయేందుకు ఉపయోగించాలనే చర్చ కూడా ఆశాజనకంగా ఉంది. కాలుష్యం ఎక్కడ ఎక్కువగా ఉంది? ఏ ప్రాంతాల్లో ప్రమాదం పెరుగుతోంది? ఏ వనరుల నుంచి కాలుష్యం వస్తోంది? భవిష్యత్తులో దాని ప్రభావం ఎలా ఉండొచ్చు? వంటి అంశాలను ఆధునిక సాంకేతికత ద్వారా ముందుగానే గుర్తించగలిగితే ప్రభుత్వాలకు వేగంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. అయితే చివరికి బాధ్యత శాస్త్రవేత్తలదే కాదు. ప్రభుత్వాలదీ, పరిశ్రమలదీ, ప్రజలదీ. పర్యావరణ పరిరక్షణను కేవలం ఒక శాఖకు అప్పగిస్తే సమస్య పరిష్కారం కాదు. కాలుష్య నియంత్రణ సంస్థలు, ఆరోగ్య శాఖ, పరిశ్రమల శాఖ, స్థానిక సంస్థలు కలిసి పనిచేయాలి. కాలుష్యాన్ని విడుదల చేసే సంస్థలపై కఠినమైన పర్యవేక్షణ ఉండాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో ప్రజలకు కూడా కాలుష్యం వల్ల కలిగే ప్రమాదాలపై నిరంతర అవగాహన కల్పించాలి. పాదరసం కాలుష్యం మన కళ్లకు కనిపించకపోవచ్చు. కానీ దాని ప్రభావం కనిపించడానికి ఆలస్యం కావచ్చు. అందుకే సమస్య తీవ్రంగా మారిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే అడ్డుకోవడం మంచిది. హైదరాబాద్‌లో జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు ప్రపంచ శాస్త్రవేత్తలకు ఒక వేదికగా మాత్రమే కాకుండా ప్రభుత్వాలకు ఒక హెచ్చరికగా కూడా నిలవాలి. పరిశోధనలు విధానాలుగా మారాలి.. విధానాలు కార్యాచరణగా మారాలి.. ఆ కార్యాచరణ చివరకు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి. అప్పుడే ఇలాంటి అంతర్జాతీయ సదస్సులకు నిజమైన అర్థం ఉంటుంది. ప్రపంచం అభివృద్ధి చెందుతున్న కొద్దీ కొత్త సాంకేతికతలు వస్తున్నాయి. కానీ ఆ అభివృద్ధి మనిషి ఆరోగ్యాన్ని, ప్రకృతిని పణంగా పెట్టి సాగకూడదు. పాదరసం కాలుష్యంపై ప్రపంచ దేశాలు కలిసి తీసుకునే నిర్ణయాలు భవిష్యత్ తరాల ఆరోగ్యాన్ని నిర్ణయించగలవు. అందుకే ఇది శాస్త్రవేత్తల చర్చగా మాత్రమే మిగలకూడదు. మన నీరు, మన ఆహారం, మన ఆరోగ్యం, మన భవిష్యత్తుకు సంబంధించిన ప్రజా సమస్యగా మారాలి.

# కమ్ముకొస్తున్న తాగునీటి కొరత

తెలుగు రాష్ట్రాల్ని కరవు కమ్మేస్తోంది. ఇప్పటికే విరుచుకుపడ్డ ఎల్‌నినో మరింత భయానకంగా మారుతోంది. మొదట సాగునీరు.. తర్వాత తాగునీటికీ కటకట తప్పేలా లేదు. ఈ దుస్థితి ఆహార సంక్షోభానికి దారితీస్తుందని చెబుతున్నారు. అంతేకాదు ఇదే పరిస్థితి కొనసాగితే.. వచ్చే ఏడాది జనం మర్చిపోయిన కరెంట్ కోతల కాలం కూడా వస్తుందనే హెచ్చరకలు వస్తున్నాయి. ఏతావాతా తెలుగు రాష్ట్రాలకు ముమ్మందు కరవు కాలం కంటిన్యూ అయ్యేలా ఉంది. ఎల్‌నినో రోజురోజుకీ తీవ్రంగా బలపడుతోంది. దీంతో తెలుగు రాష్ట్రాల్లో లోటు వర్షపాతం, వర్షాభావం పరిస్థితులు దాటి.. కరవు పరిస్థితులకు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే జలాశయాల్లో నీటి నిల్వలు అడుగంటి.. సాగునీటికే కాకుండా తాగునీటికీ కరవు వచ్చి పడింది. కొన్ని ప్రాంతాల్లో అనధికారికంగా నీటి పంపిణీ తగ్గగా.. రాబోయే రోజుల్లో భూగర్భజలం కూడా ఇంకిపోయే ప్రమాదం ఉందని భయాందోళనలు వ్యక్తమౌతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కొన్నాళ్లుగా అవసరానికి మించిన వర్షమే పడుతూ వస్తోంది. చివరకు జూన్, జులైలో లోటు వర్షపాతం నమోదైనా.. ఆగస్ట్, సెప్టెంబర్‌లో కవరైపోయేలాగే వర్షం కురుస్తూ వచ్చింది. కొన్నిసార్లు కేవలం సెప్టెంబర్‌లో కురిన వానలే.. మొత్తం వర్షపాతం రికార్డుల్ని సరిచేసిన దాఖలాలున్నాయి. దీంతో ఈసారి కూడా ఎల్‌నినో ఎల్‌నినో అని ఎంత ఊదరగొట్టినా.. ఏదో నెలలో వర్షాలు పడి.. ప్రాజెక్టులు నిండుతాయనే ధైర్యం చాలా మంది అన్నదాతల్లో కనిపించింది. దీనికి తోడు ఎప్పుడూ అంచనాలు తప్పే మన వాతావరణ శాఖ.. ఈసారి మాత్రం కరెక్టుగా చెబుతుందా ఏంటి అనే ధీమా కూడా లేకపోలేదు. కానీ ఇవేవీ ఫలించలేదు. చివరకు ఎల్‌నినో రానే వచ్చింది. జూన్ లో వర్షాలు ముఖం చాటేశాయి. ఈ విషయాన్ని ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. తర్వాత జులైలోనూ వర్షాలు సరిగ్గా పడలేదు. అయినా రైతులకు అదే ధీమా. ఆగస్టులో చూసుకుందాం.. మహా అయితే విత్తనాలు ఓ నెల ఆలస్యంగా విత్తుదాం అనుకున్నారు. కానీ ఆగస్టు కూడా సారీ చెప్పేసింది. చివరకు ఆఖరాశగా సెప్టెంబర్ వైపు ఆశగా చూశారు. పేరుకి తుపాన్ వచ్చినా.. గట్టిగా పది రోజులు కూడా వానలు పడలేదు. ఇప్పుడు నైరుతి రుతుపవనాలు నిష్క్రమించాయి. ఇప్పుడు వర్షపాతం లెక్కలు చూస్తే.. తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర వర్షాభావం ఉందని తేలింది. ఏపీలో ఏకంగా 45 శాతం లోటు ఉంటే.. తెలంగాణలో 22 శాతం లోటు వర్షపాతం నమోదైంది. దీంతో రెండు రాష్ట్రాల్లోనూ ప్రాజెక్టులు నిండుకున్నాయి. సాగునీటి విషయంలో అధికారులు ముందే చేతులెత్తేశారు. అప్పుడు తాగునీటి కోసం నీటినిల్వలు పరిరక్షిస్తున్నామని చెప్పారు. కానీ ఇప్పుడు చూస్తే.. తాగునీటికీ కటకట తప్పేలా లేదు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో తాగునీరు ఇచ్చే వ్యవధితో పాటు నీటి పరిమాణం కూడా తగ్గిందనే ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిని ఎవరూ అధికారికంగా నిర్ధారించకపోయినా.. గట్టిగా కాదని చెప్పే సాహసం కూడా చేయలేకపోతున్నారు. పైగా అన్నింటికీ మించి ఇప్పుడు తెలంగాణ భూగర్భజలవనరుల శాఖ.. ప్రతి చుక్కనూ పొదుపుగా వాడుకోవాలని హెచ్చరిస్తూ.. ప్రకటన జారీ చేయడం రాబోయే గడ్డుకాలానికి అద్దం పట్టింది. తెలంగాణలో ఏపీతో పోలిస్తే వానలు పర్వాలేదనిపించినా.. కురవాల్సినంత వర్షాలైతే పడలేదనే చెప్పాలి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. ఇప్పుడు భూగర్భజలం కూడా అడుగంటడంతో.. తాగునీటికీ కొరత వచ్చి పడే సూచనలు కనిపిస్తున్నాయి. తెలంగాణలో మిషన్ భగీరథ పథకం కింద గ్రామీణ ప్రాంతాలకు తాగునీరు అందించే 123 శుద్ధి కేంద్రాలకు రాష్ట్రంలోని 29 ప్రధాన జలాశయాలు ఆధారంగా ఉన్నాయి. ఈ 29 జలాశయాల మొత్తం నిల్వ సామర్థ్యం 1,059 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం కేవలం 333.44 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. గతేడాది ఇదే సమయంలో 522.31 టీఎంసీల నిల్వలు ఉండగా.. గతంతో పోలిస్తే ఈసారి పరిస్థితి మరింత దిగజారింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో డెడ్ స్టోరేజీకి పైన వినియోగించదగిన నీరు కేవలం 3 టీఎంసీలే మిగిలి ఉండగా.. ప్రతి నెల తాగునీటి అవసరాలకు సుమారు అర టీఎంసీ అవసరం అవుతోంది. లోయర్ మానేరు, ఎల్లంపల్లి, కడెం, జూరాల, నాగార్జునసాగర్, నిజాంసాగర్, సింగూర్, కోయిల్‌సాగర్, రామన్‌పాడు, అక్కంపల్లి, వైరా, ఉదయసముద్రం, ధర్మసాగర్ వంటి జలాశయాల్లోనూ నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. హైదరాబాద్‌తో పాటు కరీంనగర్, వరంగల్, నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాలు ఈ జలాశయాలపై ఆధారపడి ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న నిల్వలతో మంజీరా, సింగూర్, గోదావరి వ్యవస్థల నుంచి ఈ నెలాఖరు వరకు మాత్రమే తాగునీరు అందించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్ అవసరాల కోసం సింగూర్‌లో కనీసం 16 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖకు సూచనలు వెళ్లాయి. ఇదిలా ఉండగా భూగర్భ జలాల పరిస్థితి కూడా దిగజారుతోంది. నిజానికి జూన్ లోనే రాష్ట్ర సగటు భూగర్భ జలమట్టం 9.46 మీటర్ల లోతుకు పడిపోయింది. ఇప్పుడు పరిస్థితి మరింత దారుణంగా ఉండొచ్చనే అంచనాలున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని బోర్లను మరింత లోతుగా తవ్వడం, అవసరమైన చోట కొత్త బోర్లు ఏర్పాటు చేయడం, వర్షపు నీటి సంరక్షణ చర్యలను వేగవంతం చేయడం వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లను ప్రభుత్వం చేపడుతోంది. దీనికి తోడు ఈశాన్య రుతుపవన కాలంలోనూ మంచి వర్షం పడే అవకాశం లేదనే సూచనలు వస్తున్నాయి. దీంతో ప్రస్తుత దుస్థితి కొనసాగటమే గొప్ప అనుకునేలా ఉంది. ఇంతకు మించి పరిస్థితులు దిగజారకుండా ఉంటే అదే పదివేలు అని సరిపెట్టుకోవడం తప్ప చేసేదేమీ లేదని కూడా ప్రభుత్వాల చర్యలు చెప్పకనే చెబుతున్నాయి. ఎందుకంటే ప్రత్యామ్నాయ ప్రణాళికలు కూడా ఫలించని స్థాయిలో ప్రకృతి ప్రకోపం తలెత్తింది. ఇక ఇప్పుడు మానవ ప్రయత్నాలు ఫలించవని, చేయగలిగిందల్లా ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవడం, త్వరగా వర్షాలు పడాలని కోరుకోవడమేనన్ సూచనలు కనిపిస్తున్నాయి. తెలంగాణలో రానున్న నెలల్లో తాగునీటి సంక్షోభం మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అటు ఏపీలో చూస్తే.. గతంలో ఎప్పుడూ నీటి కొరత అంటే తెలియని ప్రాంతాల్లోనూ తాగునీటి సమస్య వస్తోంది. తమకు తాగునీటి సరఫరా సమస్య తీర్చాలని కొన్ని ప్రాంతాల్లో జనం రోడ్ల మీదకు వచ్చి ఆందోళనలు కూడా చేస్తున్నారు. అధికారులు ఎక్కడికక్కడ పరిష్కారాలు చూపుతున్నా.. అవి తాత్కాలికమే కానీ.. ఇక సమస్య రాదనే గ్యారెంటీ ఎవ్వరూ ఇవ్వలేని దుస్థితి. ఇదే పరిస్థితి కొనసాగితే తెలుగు రాష్ట్రాల్లో కరవు తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. చివరకు చుక్క నీరు దొరక్క.. తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు అల్లాడే దుస్థితిని కూడా చూడాల్సి వచ్చేలా ఉందనే భయాలు వ్యక్తమౌతున్నాయి.

# పార్టీలకు ఎందుకీ వెనుకడుగు?

ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికపై రాజకీయ పార్టీల్లో ఆసక్తికంటే ఆందోళనే ఎక్కువగా కనిపిస్తున్నదనే చర్చ జరుగుతోంది. సాధారణంగా ఒక నియోజకవర్గానికి ఉప ఎన్నిక వస్తే అధికార పార్టీ, ప్రతిపక్షాలు తమ బలాన్ని నిరూపించుకునేందుకు పోటీ పడుతాయి. కానీ ఖైరతాబాద్ విషయంలో పరిస్థితి కొంత భిన్నంగా కనిపిస్తోంది. మరో రెండేళ్లలోనే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇప్పుడే భారీగా ఖర్చు చేసి ఉప ఎన్నికకు వెళ్లడం వల్ల రాజకీయంగా వచ్చే లాభం ఎంత అన్నదే పార్టీల ప్రధాన ఆలోచనగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అందుకే ఉప ఎన్నిక జరగకుండా న్యాయపరమైన కారణాలతో వాయిదా పడితే బాగుంటుందనే ధోరణి ప్రధాన పార్టీల్లో ఉన్నట్టు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమయ్యే పరిస్థితి దానం నాగేందర్ అనర్హతతో ఏర్పడింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన దానం నాగేందర్ అనంతరం కాంగ్రెస్‌లో చేరి 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. పార్టీ మార్పు అంశంపై జరిగిన న్యాయపోరాటంలో ఆయనకు ప్రతికూలంగా తీర్పులు రావడంతో అసెంబ్లీ స్థానం ఖాళీగా ప్రకటించే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఖైరతాబాద్‌కు ఉప ఎన్నిక వస్తుందనే అంచనాలు బలపడ్డాయి. అయితే ఇక్కడే మరో కీలక న్యాయపరమైన అంశం తెరపైకి వచ్చింది. 2023లో కాంగ్రెస్ తరఫున దానం నాగేందర్‌పై పోటీ చేసిన విజయారెడ్డి ఆయన ఎన్నికను సవాలు చేస్తూ కోర్టును ఆశ్రయించారు. ఎన్నికల అఫిడవిట్‌లో కేసులు, ఆస్తులకు సంబంధించిన వివరాలను పూర్తిగా వెల్లడించలేదని ఆమె ఆరోపిస్తూ, దానం ఎన్నికను రద్దు చేసి రెండో స్థానంలో ఉన్న తనను ఎమ్మెల్యేగా ప్రకటించాలని కోరారు. ఈ పిటిషన్ ఇప్పటికే న్యాయస్థానం పరిధిలో ఉండటంతో, దాని తుది తీర్పు వచ్చే వరకు ఉప ఎన్నిక నిర్వహించకూడదనే వాదన ఇప్పుడు కీలకంగా మారింది. ఇదే అంశం రాజకీయ పార్టీలకు కొంత ఊరట కలిగిస్తున్నట్టు కనిపిస్తోంది. ఎందుకంటే ఉప ఎన్నిక అంటే కేవలం అభ్యర్థిని ఎంపిక చేసి ప్రచారం చేయడం మాత్రమే కాదు. అది పార్టీ ఆర్థిక శక్తికి, కేడర్ బలానికి, నాయకత్వ వ్యూహానికి పెద్ద పరీక్షగా మారుతుంది. ముఖ్యంగా పట్టణ నియోజకవర్గమైన ఖైరతాబాద్‌లో అన్ని ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకునే అవకాశం ఉంది. అలాంటి పోటీలో గెలవాలంటే ప్రచారం నుంచి పోలింగ్ మేనేజ్‌మెంట్ వరకు భారీగా వనరులు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఉప ఎన్నికల్లో ఖర్చు ఎందుకు పెరుగుతుందన్నది కూడా రాజకీయ పార్టీల లెక్కల్లో ముఖ్యమైన అంశమే. సాధారణ ఎన్నికల సమయంలో రాష్ట్రవ్యాప్తంగా వందలాది నియోజకవర్గాల్లో పోటీ ఉండటంతో ఒక పార్టీ తన వనరులను అనేక ప్రాంతాలకు విభజించాల్సి ఉంటుంది. కానీ ఉప ఎన్నికలో మొత్తం పార్టీ యంత్రాంగం ఒకే నియోజకవర్గంపై దృష్టి పెడుతుంది. రాష్ట్ర స్థాయి నాయకులు, మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, కేడర్ మొత్తం ఒకే నియోజకవర్గంలో మోహరించడంతో పోటీ తీవ్రత పెరుగుతుంది. ఫలితంగా ప్రచారం, సభలు, కార్యకర్తల నిర్వహణ, పోలింగ్ ఏజెంట్లు, రవాణా వంటి అంశాల్లో ఖర్చు భారీగా పెరిగే అవకాశం ఉంటుంది. అయితే ఇక్కడ మరో ముఖ్యమైన రాజకీయ ప్రశ్న ఉంది. ఒక ఉప ఎన్నికలో గెలిచినా పార్టీకి ఎంత ప్రయోజనం? ఓడినా ఎంత నష్టం? ఇదే ప్రస్తుతం పార్టీలను ఆలోచింపజేస్తున్న అంశంగా కనిపిస్తోంది. అధికార పార్టీ ఉప ఎన్నికలో గెలిస్తే అది ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఉందనే రాజకీయ ప్రచారానికి ఉపయోగపడుతుంది. ముఖ్యమంత్రి నాయకత్వంపై, ప్రభుత్వ పనితీరుపై సానుకూల వాతావరణం ఉందని చెప్పుకోవడానికి అవకాశం లభిస్తుంది. అదే సమయంలో విపక్ష పార్టీ గెలిస్తే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని ప్రచారం చేసుకునే అవకాశం ఉంటుంది. కానీ ఈ రెండు సందర్భాల్లోనూ రాజకీయ సమీకరణాలు శాశ్వతంగా మారిపోవాల్సిన అవసరం లేదు. ఉప ఎన్నికలో విపక్షం గెలిచినా ప్రభుత్వం వెంటనే మారిపోదు. అధికార పార్టీ గెలిచినా మరో రెండేళ్లలో జరిగే సాధారణ ఎన్నికల్లో అదే ఫలితం పునరావృతమవుతుందని హామీ ఉండదు. అంటే ఖైరతాబాద్ ఉప ఎన్నిక ఫలితం ఒక రాజకీయ సందేశాన్ని ఇవ్వగలదు కానీ రాష్ట్ర అధికారాన్ని తక్షణం మార్చే స్థాయిలో ప్రభావం చూపదు. ఇదే కారణంగా విపక్ష పార్టీల్లో కూడా పెద్దగా ఉత్సాహం కనిపించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉప ఎన్నిక గెలవడానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేసి, నెలల తరబడి పార్టీ యంత్రాంగాన్ని ఒకే నియోజకవర్గంలో పెట్టుబడి పెట్టడం కంటే, ఆ వనరులను వచ్చే సాధారణ ఎన్నికలకు సిద్ధం చేసుకోవడం మేలనే ఆలోచన ఉండొచ్చు. ముఖ్యంగా 2028 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రతి పార్టీకి అభ్యర్థుల ఎంపిక, నియోజకవర్గాల వారీగా బలాబలాల అంచనా, కేడర్ పునర్వ్యవస్థీకరణ, ఓటర్లతో సంబంధాల బలోపేతం వంటి అనేక పనులు ముందున్నాయి. అధికార కాంగ్రెస్‌కు మాత్రం ఖైరతాబాద్ ఉప ఎన్నిక రెండు వైపులా పదునున్న కత్తిలాంటిదే. గెలిస్తే ప్రభుత్వానికి బలం చేకూరుతుంది. కానీ ఓడిపోతే ప్రతిపక్షాలకు అది పెద్ద రాజకీయ ఆయుధంగా మారుతుంది. ముఖ్యంగా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో ప్రజల తీర్పు ఎలా ఉందన్న అంశాన్ని ప్రతిపక్షాలు 2028 ఎన్నికల వరకు పదేపదే ప్రస్తావించే అవకాశం ఉంటుంది. అందుకే అధికార పార్టీకి కూడా ఈ ఎన్నికలో గెలుపు అవసరమే అయినప్పటికీ, ఓటమి ప్రమాదాన్ని తక్కువగా అంచనా వేయలేని పరిస్థితి ఉంటుంది. బీఆర్ఎస్, బీజేపీ వంటి ప్రతిపక్ష పార్టీలకు కూడా ఇదే లెక్క వర్తిస్తుంది. గెలిస్తే ప్రభుత్వ వ్యతిరేకతకు బలం చేకూరుతుంది. కానీ భారీగా ఖర్చు చేసి ఓడిపోతే ఆర్థిక నష్టంతో పాటు రాజకీయంగా కూడా దెబ్బ తగిలే అవకాశం ఉంది. అందువల్ల ఖైరతాబాద్‌ను కేవలం ఒక నియోజకవర్గ ఎన్నికగా కాకుండా 2028 అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరిగే రాజకీయ పరీక్షగా చూడాల్సి ఉంటుంది. మరోవైపు విజయారెడ్డి న్యాయపోరాటం కూడా ఈ మొత్తం వ్యవహారంలో కీలకంగా మారింది. ఆమె పిటిషన్‌పై తీర్పు వెలువడే వరకు ఎన్నికల ప్రక్రియపై అనిశ్చితి కొనసాగితే, ప్రధాన పార్టీలకు తమ రాజకీయ వ్యూహాలను పునరాలోచించుకునే సమయం లభిస్తుంది. ఒకవేళ హైకోర్టు తీర్పు ప్రతికూలంగా వస్తే సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం కూడా ఉండటంతో ఈ వ్యవహారం మరింత కాలం కొనసాగవచ్చనే అంచనాలు ఉన్నాయి. అయితే తుది నిర్ణయం న్యాయస్థానాల పరిధిలోనే ఉంటుంది. మొత్తంగా చూస్తే ఖైరతాబాద్ ఉప ఎన్నిక విషయంలో రాజకీయ పార్టీల ఆసక్తి తగ్గడానికి ప్రధాన కారణం ఎన్నికపై భయం కంటే ఖర్చు--ప్రయోజనం లెక్క అని చెప్పవచ్చు. ఒకే నియోజకవర్గంలో భారీగా డబ్బు, సమయం, నాయకత్వ శక్తిని వినియోగించి గెలిచినా దాని ప్రభావం పరిమితంగానే ఉండొచ్చు. ఓడిపోతే మాత్రం ప్రత్యర్థులకు పెద్ద ప్రచారాస్త్రం దొరుకుతుంది. మరోవైపు రెండేళ్లలోనే అసెంబ్లీ ఎన్నికలు ఎదురుకానున్నాయి. అందుకే ఇప్పుడే ఖైరతాబాద్‌లో శక్తి మొత్తం ఖర్చు చేయడం కంటే 2028 కోసం రాజకీయంగా, ఆర్థికంగా సిద్ధం కావడమే మేలని ప్రధాన పార్టీలు భావిస్తున్నాయనే విశ్లేషణ వినిపిస్తోంది. అందుకే ఖైరతాబాద్ ఉప ఎన్నికపై ప్రస్తుతం కనిపిస్తున్న న్యాయపరమైన అనిశ్చితి పార్టీలకు ఒక రకంగా రాజకీయ విరామాన్ని ఇచ్చినట్టే. ఎన్నిక వస్తే తప్పనిసరిగా పోరాడాల్సిందే. కానీ ఎన్నిక ఆలస్యమైతే పార్టీలు ఊపిరి పీల్చుకుని తమ అసలు లక్ష్యమైన సాధారణ ఎన్నికలపై దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది. చివరికి ఖైరతాబాద్ ఉప ఎన్నిక కేవలం ఒక ఎమ్మెల్యే స్థానాన్ని భర్తీ చేసే ఎన్నికగా కాకుండా, 2028 తెలంగాణ రాజకీయాలకు ముందస్తు సంకేతంగా మారుతుందా లేదా అన్నదే అసలు ఆసక్తికరమైన ప్రశ్న.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# విజయారెడ్డి పిటిషన్ అర్థరహితం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసినందుకే తనపై అనర్హత వేటు పడిందని ఇలాంటి పరిస్థితి వస్తుందని తనకు ముందే తెలుసని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఖైరతాబాద్‌తో ఉపఎన్నికలకు వెళ్లాలని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిన తరుణంలో తనపై విజయారెడ్డి ఎన్నికల పిటిషన్ వేయడం అర్థరహితమని ఆయన అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడిన దానం నాగేందర్.. కాంగ్రెస్ నేత విజయారెడ్డి తనపై దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్‌పై స్పందించారు. అఫిడవిట్ విషయంలో తనపై వచ్చిన ఆరోపణలకు ఇప్పటికే తగిన సమాధానం ఇచ్చానని నాగేందర్ స్పష్టం చేశారు. ఆరోపిస్తున్న ఆస్తికి తనకు గానీ తన భార్యకు గానీ సంబంధం లేదని ఎవరో తప్పుడు సంతకాలు సృష్టించి ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇదే విషయాన్ని గతంలోనే కోర్టుకు, ఈసీకి సమాధానమిచ్చానని పేర్కొన్నారు. తాను ఇచ్చిన సమాధానంతో పాటు లోక్ సభలో పోటీ విషయంలో అన్నింటికి కలిపే సుప్రీంకోర్టు అనర్హత వేటు వేసిందని ఇటువంటి పరిస్థితుల్లో విజయారెడ్డి మళ్లీ కోర్టుకు వెళ్లడం అంటే అమె అనుభవరాహిత్యమేనన్నారు. పిటిషన్ వేసే ముందు అన్ని విషయాలు తెలుసుకోవాలన్నారు. ఒకవేళ ఖైరతాబాద్ ఉప ఎన్నిక నిర్వహణకు విజయారెడ్డి పిటిషన్ అడ్డుగా మారితే ఎన్నికల కమిషనే నేరుగా కోర్టును ఆశ్రయిస్తుందని ఆయన వివరించారు. అవసరం అయితే న్యాయనిపుణులతో చర్చించి తాను కోర్టుకు వెళతానన్నారు.

**నేను ఆ కేసు వేసింది కొత్తగా కాదు.. దానంకు విజయారెడ్డి కౌంటర్**

ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ వివాదానికి సంబంధించి కాంగ్రెస్ నేత పి.విజయారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ఆమె నగరంలో మీడియాతో మాట్లాడుతూ.. తాను వేసిన కేసు కొత్తది కాదని, పాత కేసే ప్రస్తుతం పెండింగ్‌లో ఉందని ఆమె తెలిపారు. కోర్టు పరిధిలో ఉన్న అంశాలపై మీడియా ముందు బహిరంగంగా చర్చించడం సరికాదని, ఈ అంశంపై దానం నాగేందర్ ఏం మాట్లాడుతున్నారనేది తనకు అనవసరమని ఆమె స్పష్టం చేశారు. ఎన్నికల పిటిషన్ పెండింగ్‌లో ఉన్నందున ఎన్నిక నిర్వహించలేమని ఎన్నికల సంఘం తెలిపిందని గుర్తుచేశారు.కాగా, 2023లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా దానం నాగేందర్ విజయం సాధించగా, కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన విజయారెడ్డి రెండో స్థానంలో నిలిచారు. ఎన్నికల అఫిడవిట్‌లో దానం నాగేందర్ తన భార్య, డిపెండెంట్ల ఆస్తుల వివరాలను పూర్తిగా వెల్లడించలేదని, ఓటర్లను ప్రభావితం చేయడానికి నగదు పంపిణీ చేశారని ఆరోపిస్తూ 2024 జనవరిలో విజయారెడ్డి హైకోర్టులో ఎలక్షన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ ప్రస్తుతం న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉంది. ఆ తర్వాత పరిణామాల నేపథ్యంలో దానం నాగేందర్‌పై పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు పడటంతో శాసనసభ సెక్రటేరియట్ ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయినట్లుగా ప్రకటించింది. ఈ క్రమంలోనే గతంలో తాను వేసిన ఎలక్షన్ పిటిషన్‌పై తుది తీర్పు వచ్చే వరకు ఖైరతాబాద్ ఉప ఎన్నిక నోటిఫికేషన్‌ను జారీ చేయకుండా సెంట్రల్ ఎలక్షన్ కమిషన్‌ను ఆదేశించాలని విజయారెడ్డి హైకోర్టును కోరడం ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.



# ఎస్పీకి అసదుద్దీన్ ఒవైసీ వార్నింగ్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** త్వరలో దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఎన్నికలను లక్ష్యంగా చేసుకొని ఏఐఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి ఓ సమావేశంలో పాల్గొన్న ఆయన యూపీ ముస్లింలతో పాటు దేశంలోని 20 కోట్ల మంది ముస్లింలు ఎవరి సొంత జాగీరు, వ్యక్తిగత ఆస్తి కాదని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), 'ఇండియా' కూటమి పక్షాలను తీవ్రంగా హెచ్చరించారు. ఉత్తరప్రదేశ్‌లోని శ్రావస్తిలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ముస్లింలను కేవలం తమ ఓటు బ్యాంకు, సొంత ఆస్తిగా భావిస్తే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఒవైసీ స్పష్టం చేశారు. యూపీలో బీజేపీ ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలోకి రాకూడదన్నదే తమ ముఖ్య ఉద్దేశమని, ఆ పార్టీని అడ్డుకోవడానికి ఏఐఎంఐఎం ఇతర ప్రతిపక్షాలతో పొత్తు పెట్టుకోవడానికి లేదా అవగాహనకు రావడానికి సిద్ధంగా ఉందని బహిరంగ ప్రతిపాదన చేశారు.అయితే ఈ పొత్తు ప్రతిపాదనను తమ బలహీనతగా భావిస్తే పొరపాటే అవుతుందని, ఇది తమ శక్తికి, విశాల హృదయానికి నిదర్శనమని ఒవైసీ ఘాటుగా స్పష్టం చేశారు. "ఎస్పీ నేతలు స్పష్టంగా వినండి.. మేం చాచిన ఈ చేయి బలహీనమైనది కాదు. ఎంతో శక్తిమంతమైనది.. అవసరమైతే మీ గొంతు నరాలను కూడా తెంచేయగలదు" అంటూ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. బీజేపీని నిలువరించేందుకు అందరం కలిసికట్టుగా పోరాడదామని, ఒకవేళ తమ ప్రతిపాదనను తిరస్కరిస్తే మాత్రం ఏఐఎంఐఎం ఒంటరిగానే బరిలోకి దిగి ఎన్నికల్లో పోటీ చేస్తుందని ఆయన తేల్చి చెప్పారు. యూపీ రాజకీయ సమీకరణాల్లో ఒవైసీ చేసిన ఈ తాజా వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి.

# నేరస్థుల్లో చావు భయం పుట్టించాలి..

**ఢిల్లీ :** లైంగిక నేరాలకు పాల్పడే వారిలో ప్రాణభయం కలిగించేలా ఢిల్లీ పోలీసులు పనిచేయాలని సుప్రీంకోర్టు సూచించింది. నేరాలకు పాల్పడితే తప్పకుండా శిక్ష తప్పదనే భయాన్ని నేరగాళ్లలో కలిగించాలని స్పష్టం చేసింది. ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో ఇటీవల నమోదైన అత్యాచార కేసులపై సోమవారం సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేసింది. ముందుగా కాలేజీలపై దృష్టి పెట్టాలని పోలీసులకు సూచించింది. అమ్మాయిలను వేధిస్తూ తిరిగే ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపింది. అనంతరం ఢిల్లీలోని వేలాది అక్రమంగా నిర్వహిస్తున్న తినుబండారాల కేంద్రాలపై దృష్టి సారించాలని పేర్కొంది. ఇలాంటి ప్రాంతాల్లో సంఘవిద్రోహ శక్తులు గుమిగూడుతున్నాయని, అక్కడ మద్యం కూడా అందుబాటులో ఉంటోందని కోర్టు వ్యాఖ్యానించింది. లైంగిక నేరానికి పాల్పడితే ప్రాణాలతో ఉండలేమనే భయాన్ని సంఘవిద్రోహ శక్తుల్లో కలిగించాలి. 'ఇకపై ఏదైనా చేస్తే చచ్చిపోతాం' అనే భయం ఉండాలి" అని సుప్రీంకోర్టు పేర్కొంది.

**నేరం జరిగిన తర్వాత చర్యలు కాదు..**

విచారణ సందర్భంగా ఇటీవల మైనర్ బాలికను స్లీపర్ బస్సులో సామూహిక అత్యాచారం చేసిన ఘటనతో పాటు ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో నమోదైన అత్యాచార కేసులను ప్రస్తావించిన ధర్మాసనం.. ఇలాంటి నేరాలను అడ్డుకునేందుకు పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది.నేరం జరిగిన తర్వాత ఏమి చేశారన్నది ముఖ్యం కాదని, మహిళలు సురక్షితంగా భావించేలా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొంది. దక్షిణ ఢిల్లీలోని ఓ పార్కులో బాలికపై సామూహిక అత్యాచారం జరిగిన ఘటనను ప్రస్తావించిన జస్టిస్ జేబీ పర్దివాలా నేతృత్వంలోని ధర్మాసనం.. అక్కడికి సమీపంలోనే బాలికల కాలేజీ ఉన్న విషయాన్ని గుర్తుచేసింది. కాలేజీకి కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో ఇలాంటి ఘటన జరగడంపై పోలీసులను ప్రశ్నించింది. నిందితుల గురించి స్థానికులు ముందే పోలీసులను హెచ్చరించినట్లు కోర్టు పేర్కొంది.

**వార్ రూమ్ ఏర్పాటుపై వివరాలు**

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని మనమంతా కలిసి పనిచేస్తే మార్పు తీసుకురాగల అని జస్టిస్ పర్దివాలా అన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఢిల్లీలో వార్ రూమ్ ఏర్పాటు చేసే అంశంపై పోలీసుల నుంచి వివరాలు కోరారు. లైంగిక నేరాలకు పాల్పడిన అనుమానితులను జాతీయ స్థాయి లైంగిక నేరగాళ్ల డేటాబేస్ ద్వారా ట్రాక్ చేసే అంశాన్ని కూడా కోర్టు ప్రస్తావించింది. అన్ని అంశాలపై పోలీసులు దృష్టి సారించాలని, రాబోయే నాలుగు వారాల్లో ఇలాంటి మరిన్ని ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది. విచారణ సందర్భంగా 2012 నాటి నిర్భయ ఘటనను కూడా జస్టిస్ పర్దివాలా గుర్తుచేశారు. ఆ దారుణానికి పాల్పడిన నిందితులు కూడా నేరానికి ముందు మద్యం సేవించి, తినుబండారాలు తిన్న విషయాన్ని ప్రస్తావించారు.

# రామప్పకు మైనింగ్‌తో ఏ ముప్పు లేదు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా పొందిన చారిత్రక రామప్ప ఆలయం, రామప్ప చెరువు ఉనికికి సమీపంలో బొగ్గు గనుల తవ్వకాలపై జరుగుతున్న చర్చల నడుమ సింగరేణి కాలరీస్ సంస్థ స్పష్టమైన ప్రకటన విడుదల చేసింది. మైనింగ్ వల్ల ఆలయానికి ఎటువంటి ముప్పు వాటిల్లదని, మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవాలు, అపోహలు మాత్రమేనని స్పష్టం చేసింది. భవిష్యత్తులో మైనింగ్ కార్యకలాపాలపై ఎలాంటి తదుపరి నిర్ణయమైనా సమగ్ర శాస్త్రీయ అధ్యయనం తర్వాతే ఉంటుందని క్లారిటీ ఇచ్చింది. చారిత్రక కట్టడమైన రామప్ప ఆలయానికి ఎలాంటి నష్టం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని సింగరేణి సంస్థ హామీ ఇచ్చింది.

**ఓపెన్‌కాస్ట్ మైనింగ్‌తో ఆందోళనలు..**

తెలుగు రాష్ట్రాల్లో ఉన్న, యునెస్కో గుర్తింపు పొందిన ఏకైక ప్రపంచ వారసత్వ హోదా కలిగిన రామప్ప గుడి, అలాగే వేల ఎకరాలకు సాగునీరందిస్తున్న రామప్ప చెరువుకు కేవలం 5 కి.మీ దూరంలో భారీ ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనిని ఏర్పాటు చేసేందుకు సింగరేణి సంస్థ సిద్ధమవుతోంది. ఈ గని కేటాయింపు ప్రతిపాదన వాస్తవానికి 10 ఏళ్ల క్రితమే వచ్చింది. అయితే, రామప్ప ఉనికికి ముప్పు వాటిల్లుతుందనే కారణంతో అప్పట్లో పనులు నిలిపివేశారు. అయితే, బొగ్గు గని ఏర్పాటు వల్ల రామప్పకు ప్రపంచ వారసత్వ హోదా దక్కకుండా పోతుందన్న ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో ఆ ప్రతిపాదనను పక్కనపెట్టారు. ఆ తర్వాత 2021లో యునెస్కో ఈ ఆలయానికి అధికారికంగా ప్రపంచ వారసత్వ హోదాను ప్రకటించింది.

**ముప్పు, యునెస్కో గుర్తింపు రద్దు భయం..**

అయితే, అనూహ్యంగా తాజాగా సింగరేణి సంస్థ అదే బొగ్గు గని ఏర్పాటుపై దృష్టి పెట్టడం పొలిటికల్‌గా, హిస్టోరికల్‌గా చర్చనీయాంశమైంది. ఈ గని అందుబాటులోకి వస్తే దాదాపు 1000 అడుగుల లోతు వరకు బ్లాస్టింగ్స్‌తో తవ్వకాలు సాగించనున్నారు. ఈ మైనింగ్ దాదాపు 19 ఏళ్ల పాటు కొనసాగుతుందన్న వార్తల నేపథ్యంలో.. ఆ పేలుళ్ల ప్రకంపనల తీవ్రతకు రామప్ప చారిత్రక నిర్మాణం దెబ్బతిని కూలిపోయే ప్రమాదం ఉందని, ఒకవేళ అదే జరిగితే యునెస్కో తన గుర్తింపును రద్దు చేసుకునే పరిస్థితి వస్తుందని స్థానికులు, నిపుణులు, పర్యావరణ ప్రేమికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# యాచారంలో 2,292 ఎకరాలు!

**ఫ్యూచర్ సిటీ కోసం భారీ భూసేకరణ..**

**యాచారం,ఫ్లాష్ ఇండియా :** ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ అవసరాల కోసం యాచారం మండలంలో మరో 2,292.34 ఎకరాల భూమిని సేకరించేందుకు టీజీ ఐఐసీ నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్లు ఏప్రిల్ 4, 6 తేదీల్లో విడుదలైనట్లు సమాచారం. ఈ గెజిట్ పత్రాలను స్థానికులు ఆన్‌లైన్‌లో గుర్తించడంతో భూసేకరణ అంశం మండలం లో చర్చనీయాంశంగా మారింది..నజిక్ సింగారం, రెవెన్యూ పరిధిలోని పలు సర్వే నంబర్లలో 1,022.32 ఎకరాల అసైన్డ్ భూములు, సర్వే నంబర్ 462లో 195.32 ఎకరాల అసైన్డ్ భూములు, సర్వే నంబర్ 181లో 13.19 ఎకరాల పట్టా భూములు సేకరించనున్నట్లు గెజిట్‌లోఅధికారులు పేర్కొన్నారు.అలాగే కొత్తపల్లి పరిధిలోని పలు సర్వే నంబర్లలో 900.03 ఎకరాల అసైన్డ్ భూములు, మరో 29 ఎకరాల పట్టా భూములు సేకరించనున్నట్లు వివరించారు. నందివనపర్తి, ఓంకారేశ్వరాలయానికి దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న సుమారు 1,432 ఎకరాల భూముల సేకరణపై గతంలోనే ప్రచారం జరిగింది. తాజాగా గెజిట్ వివరాలు వెలుగులోకి రావడంతో ఈ అంశంపై స్థానికుల్లో ఆసక్తి నెలకొంది. ఇదిలా ఉండగా మొండిగౌరెల్లి, పరిధిలో టీజీ ఐఐసీ పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు భూసేకరణ జరుగుతున్న విషయం తెలిసిందే. దీనికి అనుసంధానంగా చింతపట్లలోని సర్వే నంబర్ 124లో 131.28 ఎకరాల అసైన్డ్ భూమిని కూడా సేకరించనున్నట్లు గెజిట్‌లో పేర్కొన్నారు. మొత్తం భూములను ఫ్యూచర్ సిటీ, పారిశ్రామిక అభివృద్ధి అవసరాలకు వినియోగించనున్నట్లు వివరించారు.

# సప్లై ఆపేసిన ఏజెన్సీలు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర సచివాలయంలో తీవ్ర మంచినీటి కొరత ఏర్పడింది. ప్రభుత్వం రూ.50 లక్షల మేర బకాయిలు చెల్లించకపోవడంతో, సచివాలయానికి నీటిని సరఫరా చేసే ఏజెన్సీలు సరఫరాను పూర్తిగా నిలిపివేశాయి. దీంతో ప్రతినిత్యం వేలాదిగా వచ్చే ఉద్యోగులు, సిబ్బంది, సందర్శకులు తాగడానికి గుక్కెడు నీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**రూ.50 లక్షల బకాయిలు - చేతులెత్తేసిన ఏజెన్సీలు:**

సచివాలయానికి తాగునీరు సరఫరా చేసే నాలుగు ప్రధాన ఏజెన్సీలకు ప్రభుత్వం గత కొంతకాలంగా రూ. 50 లక్షల బకాయిపడింది. సచివాలయ పరిధిలోని ఒక్కో డిపార్ట్‌మెంట్ నుంచే లక్షల రూపాయల్లో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పలుమార్లు విన్నవించినా బిల్లులు క్లియర్ కాకపోవడంతో "బకాయిలు మొత్తం చెల్లిస్తే తప్ప మంచినీటిని సరఫరా చేసేది లేదని" ఏజెన్సీలు స్పష్టం చేశాయి.

**సచివాలయ అధికారుల విజ్ఞప్తి - పనిచేయని వాటర్ ఫిల్టర్లు:**

నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో సచివాలయ అధికారులు ఉద్యోగులకు వింత ప్రతిపాదన చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేవరకు ఉద్యోగులు, సిబ్బంది ఇళ్ల నుంచే మంచినీటి బాటిళ్లను తెచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు సచివాలయ ఆవరణలో ఉన్న వాటర్ ఫిల్టర్లు, కూలర్లు పనిచేయకపోవడంతో పరిశోధనలు, విధుల నిమిత్తం వచ్చే సామాన్య ప్రజలు, సిబ్బంది తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి బకాయిలు విడుదల చేసి నీటి సమస్యను పరిష్కరించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

# కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు

**ఢిల్లీ :** ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌పై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో ఇరువైపులా సుదీర్ఘ వాదనలు విన్న తర్వాత, జ్ఞానేష్ కుమార్‌ను ఆ పదవి నుంచి సస్పెండ్ చేయాలంటూ దాఖలైన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు స్పష్టంగా తిరస్కరించింది. ఈ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానిస్తూ.. రాజ్యాంగబద్ధమైన ఈ అత్యున్నత సంస్థ చట్టానికి లోబడే పనిచేస్తుందని తాము భావిస్తున్నట్లు వెల్లడించింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ వ్యవహారంలో కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీ) నోటీసులు జారీ చేస్తూ పూర్తి సమాధానం చెప్పాలని ఆదేశించింది. సోషల్ యాక్టివిస్ట్ రాకేష్ కుమార్ సింగ్, లాయర్ శైలేంద్ర మణి త్రిపాఠిలు దాఖలు చేసిన ఈ పిటిషన్లలో ముఖ్యంగా.. ఎస్ఐఆర్ , ఫామ్-6 మార్పులతో పాటు ఎన్నికల కమిషన్ తీసుకున్న అనేక ఇతర నిర్ణయాలు చట్టబద్ధమైన ప్రక్రియలను ఉల్లంఘిస్తూ తీసుకున్నవేనని తీవ్రంగా ఆరోపించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎలాంటి నిర్ణయమైనా ఏకగ్రీవంగా లేదా మెజారిటీ అభిప్రాయం ఆధారంగా మాత్రమే జరగాలని వారు గుర్తుచేశారు.పిటిషనర్ రాకేష్ కుమార్ సింగ్ తరఫున సీనియర్ అడ్వకేట్ వికాస్ సింగ్ కోర్టులో తన వాదనలను వినిపించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం మూల స్వరూపం, అందులో తెచ్చిన మార్పులతో పాటు సెక్షన్ 10(2), 10(3)లను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. కొత్తగా వచ్చిన చట్టం చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు విపరీతమైన అధికారాలను కట్టబెట్టిందని, పదవీ విరమణ పొందిన తర్వాత కూడా ఆయనపై ఎలాంటి విచారణ జరగకుండా ప్రత్యేక రక్షణ (ఇమ్యూనిటీ) కల్పించారని వికాస్ సింగ్ ఆరోపించారు. దేశ ప్రధానికి కూడా లేని, చివరికి న్యాయమూర్తులకు కూడా లభించని ఇటువంటి రక్షణను సీఈసీకి ఇవ్వడం ఏంటని ఆయన ప్రశ్నించారు. దీనిపై జస్టిస్ బాగ్చీ స్పందిస్తూ, పదవిలో ఉన్నంత వరకు రక్షణ అనేది పాత చట్టంలోనూ ఉందని తెలిపారు. అయితే, ఇప్పుడు రిటైర్మెంట్ తర్వాత కూడా రక్షణ పొడిగించారని వికాస్ సింగ్ బదులిచ్చారు. దీనికి సంబంధించి ఆ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన కేసు ఇప్పటికే కోర్టులో పెండింగ్‌లో ఉందని సీజేఐ గుర్తుచేయగా, తాము ఇక్కడ చట్టాన్ని సవాలు చేయడం లేదని, అసలు ఎన్నికల కమిషన్‌లో ఏం జరుగుతుందో తెలుసుకోవడమే తమ ఉద్దేశమని లాయర్ స్పష్టం చేశారు.అందుకే జ్ఞానేష్ కుమార్‌ను తక్షణమే సీఈసీ పదవి నుంచి సస్పెండ్ చేసి, మిగిలిన ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఈసీ కార్యకలాపాలను నిర్వహించేలా ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ తరఫు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. గతంలో 'అనూప్ బరన్‌వాల్' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సీఈసీ ఎంపిక కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)ని భాగస్వామిగా చేసే పాత వ్యవస్థను మళ్లీ పునరుద్ధరించాలని కోరారు. సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని, చట్టం ప్రకారం వీలైనంతవరకు ఏకగ్రీవంగా లేదా మెజారిటీ సభ్యుల నిర్ణయం మేరకే ఈసీ నడవాలని స్పష్టం చేశారు. కమిషన్ నిర్వహణ విధానాలపై తీసుకునే నిర్ణయాలు ఏకగ్రీవంగా ఉండాలని, సాధారణ పనితీరుకు సంబంధించిన నిర్ణయాలు మెజారిటీ ఆధారంగా ఉండవచ్చని వాదించారు. విచారణ సమయంలో సీజేఐ జోక్యం చేసుకుంటూ.. పిటిషనర్లు కేవలం ఒక వార్తా పత్రిక కథనం ఆధారంగా వాదనలు వినిపిస్తున్నారని, కేవలం దాన్ని చూసి కోర్టు ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేదని తేల్చి చెప్పారు. ముందుగా ఎన్నికల సంఘం నుంచి సమాధానం రానివ్వాలని పేర్కొన్నారు. దీనిపై వికాస్ సింగ్ స్పందిస్తూ.. ఈసీ సొంతంగా విడుదల చేసిన ప్రెస్ రిలీజ్ కూడా సదరు వార్తా కథనాన్ని ఖండించలేదని, ఎన్నికల సంఘం చట్టబద్ధమైన వ్యవస్థలను కాలరాయలేదని అన్నారు. దానికి స్పందించిన సీజేఐ, "ముందుగా వారిని కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయనివ్వండి. దేశంలో ఒక స్పష్టమైన చట్టం ఉంది, వారు దాన్ని కచ్చితంగా పాటించే ఉంటారని మేము భావిస్తున్నాం. ఒకవేళ ఏవైనా ఉల్లంఘనలు జరిగినట్లు తేలితే ఆ నిర్ణయాలను మేమే రద్దు చేస్తాం" అని స్పష్టం చేశారు. అయితే, ఒకసారి ఎన్నికలు పూర్తయి ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత ఆ ఫలితాలను రద్దు చేయడం ఎలా సాధ్యమవుతుందని, అందుకే ఎన్నికల ప్రక్రియ విశ్వసనీయత దెబ్బతినకుండా ఉండేందుకు కోర్టు తక్షణమే మధ్యంతర చర్యలు తీసుకోవాలని పిటిషనర్ తరఫు న్యాయవాది గట్టిగా విజ్ఞప్తి చేశారు.

# భీమ్‌గల్ పీఎస్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం..



**నిజామాబాద్,ఫ్లాష్ ఇండియా :** జిల్లాలోని భీమ్‌గల్ పోలీస్ స్టేషన్‌లో సుధాకర్ అనే వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకున్నాడు. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన వైద్య చికిత్స కోసం అతడిని ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసుల వేధింపుల వల్లే సుధాకర్ ఆత్మాహత్యాయత్నానికి పాల్పడ్డాడని అతడి కుటుంబ సభ్యులు ఆరోపించారు.భీమ్‌గల్ పట్టణంలో సుధాకర్ హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే రాత్రి 10.00 గంటల తర్వాత హోటల్‌లోని టేబుళ్లు బయట రహదారి పక్కన పెట్టాడు. గస్తీ విధులు నిర్వహిస్తున్న పోలీసులు.. రహదారిపై ఆ టేబుళ్లు తీయాలని సుధాకర్‌ను ఆదేశించారు. అతడు కాస్తా ముక్త సరిగా సమాధానం ఇచ్చాడు. దీంతో ఆ టేబుళ్లను అక్కడి నుంచి పోలీసులు తరలించారు. ఈ సందర్భంగా టేబుళ్లను వదిలి వెళ్లాలంటూ పోలీసులను సుధాకర్ బతిమిలాడాడు.కానీ వాటిని వారు వదిలి వెళ్లలేదు. సుధాకర్‌పై ఎస్ఐ తిరుపతి కేసు నమోదు చేశారు. ఇక సోమవారం కోర్టుకు వెళ్లాలంటూ సుధాకర్‌ను పోలీస్ స్టేషన్‌కు పోలీసులు పిలిపించారు. దీంతో అతడు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. దాంతో తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ తన ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. అతడి పరిస్థితి విషమంగా మారింది. ఈ నేపథ్యంలో మెరుగైన వైద్య చికిత్స కోసం అతడిని ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# సర్వోత్తమ్ రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలి...






**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రోజు మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తో కలిసి సమావేశం నిర్వహించారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి చేపట్టాల్సిన ప్రచార కార్యక్రమాలు,పట్టభద్రుల ఓటు నమోదు మరియు ఓటర్లను చైతన్యపరిచే అంశాలపై సమావేశంలో చర్చించారు.నియోజకవర్గంలోని ప్రతి పట్టభద్రుడిని సంప్రదించి,ఓటు హక్కు ఉన్న వారందరూ తమ ఓటును నమోదు చేసుకునేలా కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులకు సూచించారు.అలాగే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రచారాన్ని మరింత విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మిర్యాలగూడ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# టీయూడబ్ల్యూజే -143 మండల కమిటీ ఎన్నిక

**వికారాబాద్ జిల్లా / చౌడాపూర్ మండల,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
మండలంలో టియు డబ్ల్యూజె హెచ్ -143 యూనియన్ మండల నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక జరిగాయి.వికారాబాద్ జిల్లా కమిటీ సూచనల మేరకు పరిగి డివిజన్ అధ్యక్షులు వి శ్రీనివాసరావు, సీనియర్ యూనియన్ నాయకులు కే శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పండాల సురేష్, డివిజన్ కార్యదర్శి కోస్గి కుమార్ ల సమక్షంలో ఈ మండల కమిటీ ఎన్నిక జరిగింది మండల కమిటీ అధ్యక్షులుగా కామారం రామస్వామి, ప్రధాన కార్యదర్శి కె. యశ్వంత్, ఉపాధ్యక్షులు జోగు శ్రీనయ్య,కార్యదర్శి పరిగి అశోక్,కొత్తయాదయ్య,ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డాక్టర్ బి వెంకటేష్ కోశాధికారి సంటి చందు ఎన్నికయ్యారు.ఇక కార్యవర్గ సభ్యులు గా నసీర్,బుచ్చయ్య,కోస్గి కుమార్,యం.కొండయ్య,శేఖర్,బ్యాగరి శ్రీను,కావాలి నవీన్,మొగిలి గిద్ద గిరి,హన్మంత్ రెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు కామారం రామస్వామి మాట్లాడుతూ.. వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని,జర్నలిస్టులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని తదితరులు పాల్గొన్నారు.

# స్టార్ ఫిట్‌నెస్ స్టూడియో 7 బ్రాంచ్ ను ప్రారంభించిన డిసిసి తోటకూర వజ్రేష్ యాదవ్



**మేడిపల్లి,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పీర్జాదిగూడ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన స్టార్ ఫిట్‌నెస్ స్టూడియో 7 వ బ్రాంచ్ ను మేడ్చల్- మల్కాజ్గిరి జిల్లా డీసీసీ తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరైఫిట్నెస్ స్టూడియో ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిథి మాట్లాడుతూ యాంత్రిక యుగంలో ప్రతి మనిషికి మానసిక ప్రశాంతత ఆరోగ్య పరిరక్షణకు వ్యాయామం ఎంతో దోహదపడుతాయని, ప్రతి ఒక్కరూ కొంత సేపైనా వ్యాయామం చేయాలని సూచించారు. బోడుప్పల్ సర్కిల్ ప్రజలకు స్టార్ ఫిట్నెస్ స్టూడియో అందుబాటు తెచ్చినందుకు నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మే- యర్ శివకుమార్ గౌడ్ పీర్జాదిగూడ, మేడిపల్లి డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండి శ్రీరాములు గౌడ్,తుంగతుర్తి రవి, సీనియర్ నాయకులు బండి సతీష్ గౌడ్,మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు తవిటి ప్రశాంత్ , స్పోక్స్ మాన్ వెంకటేష్ గౌడ్ ,తదితరులు పాల్గొన్నారు స్టార్ ఫిట్‌నెస్ స్టూడియో నిర్వాహకులు, సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక యువత తదితరులు పాల్గొన్నారు.

# పలు కుటుంబాలను పరామర్శించిన డా. చిరుమిల్ల రాకేష్ కుమార్





**సుల్తానాబాద్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** పెద్దపల్లి నియోజకవర్గంలోని పలు కుటుంబాలను టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. చిరుమిల్ల రాకేష్ కుమార్ పరామర్శించారు.సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి గ్రామ మాజీ ఎంపీటీసీ కోడి కనకయ్య తల్లి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని రాకేష్ కుమార్ పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.అదేవిధంగా గట్టెపల్లి గ్రామానికి చెందిన నల్లవెల్లి లక్ష్మణ్ భార్య నల్లవెల్లి శారద ఇటీవల మృతి చెందడంతో ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. శారద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గంటా రాములు యాదవ్, మాజీ ఎంపీటీసీ సూర శ్యామ్, మాజీ సర్పంచ్ నల్లవెల్లి రాజమౌళి, సీనియర్ నాయకులు తాళ్లపల్లి మనోజ్ గౌడ్, ఈర్ల సంతోష్, కోడి రమేష్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలి



**నల్గొండ జిల్లా/చింతపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటరు జాబితాల తయారీ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలని భారతీయ జనతా పార్టీ నల్గొండ మాజీ పార్లమెంట్ కన్వీనర్ నక్క వెంకటేశ్వర్లు యాదవ్ పిలుపునిచ్చారు. తెలంగాణలోని వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గం, మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గంలకు సంబంధించి కొత్తగా ఓటరు జాబితాల తయారీ ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

**పాత ఓటర్లు కూడా దరఖాస్తు చేసుకోవాలి**

ఇప్పటికే గ్రాడ్యుయేట్ ఓటరు జాబితాలో పేరు ఉన్నవారు కూడా ప్రస్తుత డి-నోవో/సవరించిన ప్రక్రియలో నిబంధనల ప్రకారం Form-18 ద్వారా దరఖాస్తు చేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. గతంలో ఓటరు జాబితాలో పేరు ఉందనే కారణంతో ఈసారి దరఖాస్తు చేయకుండా ఉండకూడదని సూచించారు.గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఓటరుగా నమోదు కావడానికి సంబంధిత అర్హతలు, నివాస నిబంధనలు, పట్టభద్రుడై ఉండాల్సిన కాలపరిమితి వంటి ఎన్నికల సంఘం నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. Form-18 అనేది గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఓటరు జాబితాలో పేరు చేర్చుకోవడానికి ఉపయోగించే అధికారిక దరఖాస్తు. నల్గొండ జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో కూడా Form-18 ఆన్‌లైన్ అప్లికేషన్ అందుబాటులో ఉంది.

**నవంబర్ 6 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం**

అర్హులైన పట్టభద్రులు ఆన్‌లైన్ విధానంలో లేదా సంబంధిత ERO/AERO/Designated Officer వద్ద Form-18 సమర్పించే విధానాన్ని వినియోగించుకోవాలని నక్క వెంకటేశ్వర్లు యాదవ్ తెలిపారు. దరఖాస్తుతో పాటు అవసరమైన విద్యార్హత, ఇతర ధ్రువపత్రాలను ఎన్నికల నిబంధనల ప్రకారం సమర్పించాలని సూచించారు.

**యువతలో విస్తృత అవగాహన కల్పించాలి**

గ్రాడ్యుయేట్ ఓటు అనేది పట్టభద్రుల ప్రజాస్వామ్య భాగస్వామ్యానికి సంబంధించిన ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ అని ఆయన పేర్కొన్నారు. గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో ఉన్న అర్హులైన పట్టభద్రులకు Form-18, అవసరమైన ధ్రువపత్రాలు, దరఖాస్తు విధానం, చివరి తేదీ తదితర అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.“ఒక్క ఓటు కూడా ప్రజాస్వామ్యంలో విలువైనదే. అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు తన పేరు గ్రాడ్యుయేట్ ఓటరు జాబితాలో నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో తన భాగస్వామ్యాన్ని కొనసాగించాలి. చివరి తేదీ వరకు వేచి ఉండకుండా అర్హులైన పట్టభద్రులు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలి” అని నక్క వెంకటేశ్వర్లు యాదవ్ అన్నారు.



## విష్ణుపురి ఎంక్లేవ్ అధ్యక్షుడిగా పాండు గౌడ్ ఘన విజయం

### అభినందించిన మాజీ కార్పొరేటర్ బండి రమ్య సతీష్ గౌడ్

**పీర్జాదిగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పీర్జాదిగూడ విష్ణుపురి ఎంక్లేవ్ కాలనీకీ నిర్వహించినఎన్నికల్లో రాజశేఖర్ రెడ్డి పై పాండు గౌడ్ 22 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు.ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ బండి రమ్య సతీష్ గౌడ్ పాండు గౌడును శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి సీఐ జలంధర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు ఉమామహేశ్వర్ రెడ్డి,నర్సింహా, కిరణ్, రాజేందర్ నర్సింహా రామ్మోహన్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు పెద్దపీట మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి భూమి పూజలు



**వికారాబాద్ జిల్లా / చౌడాపూర్ మండల,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, మహిళా సంఘాల ద్వారా వివిధ వ్యాపార అవకాశాలను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారని ఈ సందర్భంగా తెలిపారు.“కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలి” అనే లక్ష్యంతో మహిళా స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి గారి ఆధ్వర్యంలో చౌడాపూర్ మండలంలోని సుమారు 24 గ్రామ పంచాయతీలకు 24 మహిళా సంఘాల భవనాలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.ఈరోజు చౌడాపూర్ మండల కేంద్రంలో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడం జరిగింది.ఈ కార్యక్రమంలో చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం. చంద్రశేఖర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఏలపాటి అశోక్ కుమార్ పాల్గొని, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఖువ శివ గౌడ్. పంచాయతీ కార్యదర్శి రమేష్.కుమార్ సర్పంచ్ పరిగి నవీన్ కుమార్, ఉప సర్పంచ్ బ్యాగరి రాజు పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటయ్య , మరికల్ గ్రామ పెద్దలు నర్సింహారెడ్డి, చౌడాపూర్ మండల ప్రధాన కార్యదర్శి రాము, జమ్మె నర్సింహులు, రాజు గౌడ్, యాదయ్య, కొకటం శివకుమార్, గోపాల్, గ్రామ కమిటీ అధ్యక్షులు యాదయ్య,శ్రీను.మరియు ఇతర నాయకులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.మహిళా సాధికారతే - సమాజ అభివృద్ధికి పునాది మహిళా సంఘాల బలోపేతమే - మహిళల ఆర్థిక స్వావలంబనకు మార్గం

# నూతన విద్యుత్ సబ్‌స్టేషన్లకు ప్రభుత్వ స్థలాలు కేటాయించండి..



**పటాన్చెరు,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు నియోజకవర్గంలో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వ స్థలాలను కేటాయించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు.సోమవారం సాయంత్రం సంగారెడ్డిలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశమై నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు.

**విద్యుత్ సబ్‌స్టేషన్లకు స్థలాల కేటాయింపు..**

నియోజకవర్గంలో వేగంగా జరుగుతున్న పట్టణీకరణ, రియల్ ఎస్టేట్ అభివృద్ధి నేపథ్యంలో విద్యుత్ డిమాండ్ కూడా పెరుగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ఘనాపూర్, ఈదుల నాగులపల్లి, కర్దనూరు చౌరస్తా, వెలిమల తండా ప్రాంతాల్లో 33/11 కేవీ నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలను కేటాయించాలని కోరారు.స్థలాలు అందుబాటులోకి వస్తే విద్యుత్ శాఖ తరఫున పరిపాలనా అనుమతుల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల ప్రజలకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందని వివరించారు.

**ఇస్నాపూర్ పోలీస్ స్టేషన్‌కు 2 ఎకరాలు**

ఇస్నాపూర్ పరిధిలో నూతన పోలీస్ స్టేషన్ మంజూరైన నేపథ్యంలో శాశ్వత భవన నిర్మాణానికి సర్వే నంబర్ 496లో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతంలో స్థలం కేటాయించి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పోలీస్ స్టేషన్ భవనాన్ని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**కొల్లూరు భూములు స్థానిక అవసరాలకే**

తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొల్లూరులో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం కేటాయించిన భూమిని స్థానిక ప్రజల అవసరాలకు వినియోగించాలని ఎమ్మెల్యే కోరారు.సర్వే నంబర్ 203లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించిన 145 ఎకరాల్లో సుమారు 25 ఎకరాల భూమి నిరుపయోగంగా ఉన్నట్లు పేర్కొంటూ, ఆ భూమిని ఇతర అవసరాలకు కేటాయించే బదులు స్థానిక ప్రజల అవసరాలకు ఉపయోగించాలని కోరారు.ముఖ్యంగా కొల్లూరులో మోడల్ మార్కెట్ ఏర్పాటు, హిందూ-ముస్లిం-క్రైస్తవ స్మశాన వాటికలకు స్థలాల కేటాయింపు వంటి ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని భూమిని వినియోగించాలని కలెక్టర్‌ను అభ్యర్థించారు.

**అర్హులైన జర్నలిస్టులకు స్థలాలు కేటాయించాలి**

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టుల సమస్యలను కూడా ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పటాన్చెరు నియోజకవర్గ పరిధిలో అర్హులైన జర్నలిస్టులకు స్థలాల కేటాయింపుపై కూడా సానుకూలంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

**సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం: కలెక్టర్**

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రస్తావించిన అంశాలపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సానుకూలంగా స్పందించారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని ఆయా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ఖైదీలకు బెయిల్ మంజూరు చేసే అధికారం కోర్టులకే ఉంటుంది.. జైలు అధికారులకు కాదు.



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:**
చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్‌పై హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ చేసిన ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ అన్నారు. జైలు అధికారులపై ఆరోపణలు చేసే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని ఆయన సూచించారు.ఒక న్యాయవాది హత్య కేసులో నిందితుడిగా ఉన్న రౌడీషీటర్ జైలు సూపరింటెండెంట్‌కు లంచం ఇచ్చి బెయిల్ పొందాడని ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు.ఖైదీలకు బెయిల్ మంజూరు చేసే అధికారం కోర్టులకు మాత్రమే ఉంటుందని,జైలు సూపరింటెండెంట్‌కు లేదా ఇతర జైలు అధికారులకు బెయిల్ మంజూరు చేసే అధికారం ఉండదనే కనీస న్యాయపరమైన అవగాహన ఎంపీ గారికి లేదా? అని లింగం గౌడ్ ప్రశ్నించారు.కోర్టు బెయిల్ మంజూరు చేసిన అనంతరం జైలు నిబంధనలు, కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఖైదీని విడుదల చేసే ప్రక్రియను జైలు అధికారులు నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

# మారుతి నగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**అమీన్పూర్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** బీరంగూడ డివిజన్ పరిధిలోని మారుతి నగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. గతంలో కాలనీవాసులు తమ కాలనీలో సీసీ రోడ్డు నిర్మించాలని అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.కాలనీవాసుల సమస్యను పటాన్చెరు నియోజకవర్గ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ దృష్టికి శశిధర్ రెడ్డి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి సీసీ రోడ్డు పనులు మంజూరు చేయించేందుకు కృషి చేశారు.మంజూరైన సీసీ రోడ్డు పనులను సోమవారం కాలనీవాసులతో కలిసి శశిధర్ రెడ్డి ప్రారంభించారు. తమ సమస్య పరిష్కారానికి కృషి చేసిన కాటా శ్రీనివాస్ గౌడ్, శశిధర్ రెడ్డికి ఈ సందర్భంగా కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. సీసీ రోడ్డు పనులు ప్రారంభం కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

# మొత్తం 5 మ్యాచ్‌ల షెడ్యూల్ ఇదే





భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య క్రికెట్ సిరీస్ కొనసాగుతోంది. ఇప్పటికే ముగిసిన వన్డే సిరీస్‌ను టీమిండియా 2-1తో కైవసం చేసుకుంది. తొలి రెండు వన్డేల్లో భారత్ విజయం సాధించగా, మూడో వన్డేలో వెస్టిండీస్ గెలిచింది. ఇప్పుడు ఇరు జట్లు టీ20 ఇంటర్నేషనల్ సిరీస్‌కు సిద్ధమయ్యాయి. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ అక్టోబర్ 6న జరగనుంది.

**అక్టోబర్ 6న తొలి టీ20**

భారత్-వెస్టిండీస్ మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 ఇంటర్నేషనల్ సిరీస్‌కు అక్టోబర్ 6న తెర లేవనుంది. తొలి టీ20 మ్యాచ్ లక్నో వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్ కోసం ఇరు జట్లు ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించాయి. ఈ సిరీస్‌లో టీమిండియాకు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఇటీవల జరిగిన ఆసియా క్రీడల్లో భారత జట్టు పాకిస్థాన్‌ను ఓడించి స్వర్ణ పతకం సాధించింది. ఇప్పుడు అదే జోష్‌తో వెస్టిండీస్‌పై టీ20 సిరీస్‌లో బరిలోకి దిగనుంది.

**భారత్-వెస్టిండీస్ టీ20 సిరీస్ పూర్తి షెడ్యూల్**

తొలి టీ20: అక్టోబర్ 6 -- లక్నో
రెండో టీ20: అక్టోబర్ 9 -- రాంచీ
మూడో టీ20: అక్టోబర్ 11 -- ఇండోర్
నాలుగో టీ20: అక్టోబర్ 14 -- హైదరాబాద్
ఐదో టీ20: అక్టోబర్ 17 -- బెంగళూరు

అక్టోబర్ 17న జరిగే ఐదో టీ20తో ఈ సిరీస్ ముగియనుంది.

**వాషింగ్టన్ సుందర్ స్థానంలో నమన్ ధీర్**

వెస్టిండీస్‌తో టీ20 సిరీస్ కోసం బీసీసీఐ ప్రకటించిన భారత జట్టులో తాజాగా మార్పు చోటుచేసుకుంది. ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ స్థానంలో నమన్ ధీర్ కు అవకాశం కల్పించారు. న్యూజిలాండ్‌తో జరగనున్న టెస్ట్ సిరీస్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అక్టోబర్ 11 నుంచి రంజీ ట్రోఫీ సీజన్ కూడా ప్రారంభం కానుండటంతో వాషింగ్టన్ సుందర్ తన రాష్ట్ర జట్టుకు రెడ్-బాల్ క్రికెట్ ఆడుతూ టెస్ట్ సిరీస్‌కు సిద్ధమయ్యే అవకాశం ఉంది.

**వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌కు భారత జట్టు ఇదే**

వెస్టిండీస్‌తో టీ20 సిరీస్ కోసం టీమిండియా జట్టులో మొత్తం 15 మంది ఆటగాళ్లు ఉన్నారు.

**భారత జట్టు:**

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, సంజు శాంసన్, తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, నితీశ్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, నమన్ ధీర్. భారత్-వెస్టిండీస్ మధ్య జరిగే ఈ ఐదు టీ20 మ్యాచ్‌లు క్రికెట్ అభిమానులకు మంచి ఎంటర్ టైన్ మెంట్ ను అందించనున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్‌లో అక్టోబర్ 14న జరగనున్న నాలుగో టీ20పై తెలుగు రాష్ట్రాల క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.



# సెంచరీ చేసినా ఉపయోగం లేదు..

వెస్టిండీస్‌తో జరిగిన మూడో వన్డేలో అజేయ శతకం సాధించినప్పటికీ, భారత వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ జట్టు విజయం సాధించలేకపోవడంపై నిరాశ వ్యక్తం చేశారు. మ్యాచ్ అనంతరం తన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన, సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయలేకపోయినందుకు బాధగా ఉందన్నారు. ఈ ఏడాది జనవరిలో న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్ తర్వాత తనకు మిడిలార్డర్‌లో ఎక్కువ సేపు బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదని, వచ్చే ఏడాది అక్టోబర్‌లో వన్డే వరల్డ్ కప్ వస్తుండటంతో క్రీజులో విలువైన సమయం గడపడం తనకు చాలా ముఖ్యమని రాహుల్ స్పష్టం చేశారు. నెట్స్ లో తాను చేస్తున్న కష్టాన్ని మ్యాచ్‌లో పరిశీలించుకోవడానికి ఈ ఇన్నింగ్స్ దోహదపడిందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేసేటప్పుడు ఎదురయ్యే సవాళ్ల గురించి మాట్లాడుతూ.. గత ఆరేడేళ్లుగా తాను ఈ పాత్రను పోషిస్తున్నానని తెలిపారు. అయితే గత ఒకటిన్నర సంవత్సరాలుగా మారుతున్న నిబంధనల వల్ల పరిస్థితులు చాలా మారాయని, మ్యాచ్ చివరి దశలో పాత బంతి సాఫ్ట్ అయి రివర్స్ స్వింగ్ అవుతున్నప్పుడు పెద్ద షాట్లు ఆడటం కష్టమవుతోందని చెప్పారు. తాను ఎప్పుడూ టాప్ ఆర్డర్‌లో ఆడేవాడినని, వేగంగా వచ్చే హార్డ్ బాల్ తనకు ఇష్టమని పేర్కొన్నారు. కానీ, మిడిలార్డర్‌లో నంబర్ 5 లేదా 6 స్థానాల్లో ఆడేవారు పాత బాల్‌తోనూ ఆడటంలో పట్టు సాధించాలని, జట్టు కోసం నిలకడగా రాణించేందుకు తాను ఇదే అంశంపై ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు రాహుల్ వెల్లడించారు. ఇక 2027 వన్డే ప్రపంచకప్ సన్నాహకాలపై స్పందిస్తూ.. ఈ ద్వైపాక్షిక సిరీస్‌లు జట్టుకు ప్రయోగాలు చేయడానికి చక్కటి అవకాశమని అభిప్రాయపడ్డారు. వన్డే క్రికెట్‌లో ఇప్పుడు 340-350 పరుగులు కూడా సులభంగా ఛేదించబడుతున్నాయని, అందుకే తమ బ్యాటింగ్ యూనిట్ కేవలం 330 పరుగులకే పరిమితం కాకుండా 370 నుంచి 400 పరుగుల మార్క్‌ను చేరుకునేలా దూకుడుగా ఆడటంపై దృష్టి పెట్టిందని తెలిపారు. క్రీజులోకి రాగానే ఎక్కువ సమయం తీసుకోకుండా స్ట్రైక్ రొటేట్ చేస్తూ బౌండరీలు బాదడమే తమ లక్ష్యమని చెప్పారు. యువ ఆటగాళ్లకు తగినన్ని అవకాశాలు ఇవ్వడానికి కోచ్, కెప్టెన్ స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నారని కేఎల్ రాహుల్ తెలిపారు.

# వైభవ్ సూర్యవంశీకి దక్కని చోటు..



భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య అక్టోబర్ 6వ తేదీ నుంచి ప్రారంభంకానున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం మాజీ క్రికెటర్ చతేశ్వర్ పుజారా భారత జట్టు ప్లేయింగ్ ఎలెవన్‌ను ప్రకటించారు. ఈ జట్టులో యవ సంచలనం వైభవ్ సూర్యవంశీకి ఆయన చోటు కల్పించకపోవడం గమనార్హం. ఇటీవల ముగిసిన ఆసియా క్రీడల్లో భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించిన వైభవ్ సూర్యవంశీ, అత్యంత పిన్న వయసులో స్వర్ణ పతకం సాధించిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. సెమీఫైనల్‌లో శ్రీలంకపై 21 బంతుల్లో 38 పరుగులు, ఫైనల్లో పాకిస్థాన్‌పై 9 బంతుల్లో 15 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అయితే విండీస్‌తో జరిగే టీ20 సిరీస్ కోసం పుజారా ఎంపిక చేసిన తుది జట్టులో అతనికి స్థానం దక్కలేదు. పుజారా తన ప్లేయింగ్ ఎలెవన్‌లో ఇషాన్ కిషన్‌ను మూడో స్థానంలో బ్యాటింగ్‌కు దించాలని నిర్ణయించగా, వైభవ్ స్థానంలో ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డికి అవకాశం కల్పించారు. అలాగే స్టార్ పేసర్ బుమ్రాకు విశ్రాంతినివ్వడంతో, ఆయన స్థానంలో అర్ష్‌దీప్ సింగ్, యువ ఆటగాడు ప్రిన్స్ యాదవ్‌లను పేస్ అటాక్‌కు ఎంపిక చేశారు. స్పిన్ విభాగంలో రవి బిష్ణోయ్ బదులుగా కుల్దీప్ యాదవ్‌కు చోటు దక్కింది. ఇక వెస్టిండీస్‌తో ఇటీవల ముగిసిన వన్డే సిరీస్‌ను భారత్ 2-1 తేడాతో కైవసం చేసుకుంది. చివరిదైన మూడో వన్డేలో విండీస్ కెప్టెన్ షాయ్ హోప్ అద్భుతమైన అజేయ శతకంతో చెలరేగి జట్టుకు చారిత్రాత్మక విజయాన్ని అందించాడు. కేఎల్ రాహుల్ అజేయ సెంచరీ, రోహిత్ శర్మ, రుతురాజ్ గైక్వాడ్ అర్ధశతకాలతో భారత్ భారీ స్కోరు సాధించినప్పటికీ, విండీస్ అద్భుతమైన ఛేదనతో మ్యాచ్‌ను గెలుచుకుంది. ఈ నేపథ్యంలో ఇరు జట్ల మధ్య జరగబోయే టీ20 సిరీస్ అత్యంత రసవత్తరంగా సాగనుందని క్రికెట్ నిపుణులు భావిస్తున్నారు.

**పుజారా ఎంపిక చేసిన టీ20 జట్టు:** అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, శివమ్ దూబే, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్.

# కారణం చెప్పిన గంభీర్



యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి జట్టులో అవకాశం ఇవ్వకపోవడంపై భారత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. వైభవ్ మంచి ఫామ్‌లో ఉన్నప్పటికీ.. ప్రస్తుతం సంజు శాంసన్, అభిషేక్ శర్మలతో కూడిన ఓపెనింగ్ జోడీ బాగా రాణిస్తుండటంతో అతడిని తుది జట్టులోకి తీసుకోవడం కష్టంగా మారిందని చెప్పాడు. జట్టుకు ఎవరు విజయాన్ని అందించగలరని కెప్టెన్, కోచ్ భావిస్తారో.. అదే ప్రాతిపదికగా తుది జట్టును ఎంపిక చేస్తామని పేర్కొన్నాడు. 'వైభవ్ మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఇది నాకు కూడా కొత్త అనుభవమే. అయితే చాలాకాలంగా బాగా ఆడుతున్న ఆటగాళ్లు జట్టులో ఉన్నప్పుడు.. అవకాశం కోసం కొంతకాలం వేచి ఉండాల్సి ఉంటుందని వైభవ్‌కు వివరించాను. సోషల్ మీడియా లేదా బయట జరుగుతున్న చర్చలు తుది జట్టును నిర్ణయించవు. డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న ఆటగాళ్లలో ఎవరు మ్యాచ్‌ను గెలిపించగలరు? ప్రస్తుతం అత్యుత్తమ కాంబినేషన్ ఏది? చాలాకాలంగా ఎవరు బాగా ఆడుతున్నారు? అనే అంశాలను బట్టి తుది జట్టును ఎంపిక చేస్తాం. ఈరోజు వైభవ్‌ను ఆడిస్తే.. జట్టు నుంచి తప్పించే ఆటగాడితో నేను కష్టమైన సంభాషణ చేయాల్సి ఉంటుంది. అది అభిషేక్ కావొచ్చు లేదా సంజు కావొచ్చు. రెండేళ్లుగా కొనసాగుతున్న కాంబినేషన్‌ను ఒక్కసారిగా పక్కన పెట్టలేం. మూడు, నాలుగు మ్యాచ్‌ల్లో విఫలమయ్యారని వారిని తప్పించి.. యువ ఆటగాడిని తీసుకోవడం సరైన నిర్ణయం కాదు. వైభవ్‌కు తప్పకుండా అవకాశాలు వస్తాయి. అయితే సరైన సమయం కోసం అతడు వేచి ఉండాల్సిందే' అని గంభీర్ స్పష్టం చేశాడు.

**పాపులర్ నిర్ణయాలు తీసుకోలేను..**

తన ఎంపికలపై మాజీ క్రికెటర్లు, విశ్లేషకులు, అభిమానుల నుంచి విమర్శలు వస్తున్న నేపథ్యంలో గంభీర్ స్పందించాడు. 'నాకు పాపులర్ నిర్ణయాలు తీసుకోవడం చాలా సులభం. కానీ సరైన నిర్ణయం తీసుకోవడం మాత్రం చాలా కష్టం. ప్రస్తుతం సంజు, అభిషేక్‌ను కొనసాగించడం సరైన నిర్ణయమని మేము భావించాం. ప్రపంచ క్రీడా చరిత్రలో ఏ జట్టు కూడా ఒక ప్రపంచకప్ నుంచి మరో ప్రపంచకప్ వరకు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా.. మళ్లీ ప్రపంచకప్ గెలవలేదు. మూడు మ్యాచ్‌ల్లో వైఫల్యం ఆటగాడిని చెడ్డ ఆటగాడిగా మార్చదు. అలాగే మన జట్టును కూడా చెడ్డ జట్టుగా మార్చదు' అని గంభీర్ వెల్లడించాడు.

# బిజినెస్



# భారత్‌కు గ్లోబల్ గండం

భారత ఆర్థికవ్యవస్థ పునాదులు అత్యంత బలంగా ఉన్నప్పటికీ, సుదీర్ఘకాలం పాటు కొనసాగే గ్లోబల్ ఒడిదుడుకులు, అంతర్జాతీయ అనిశ్చితి దేశీయ ఆర్థిక వృద్ధికి ప్రతిబంధకంగా మారవచ్చని 'స్టాక్‌హోమ్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్' డైరెక్టర్ ఎరిక్ బెర్గ్‌లోఫ్ అభిప్రాయపడ్డారు. న్యూఢిల్లీలో జరిగిన 'కౌటిల్య ఎకనామిక్ కాన్‌క్లేవ్'లో ఆయన మాట్లాడుతూ, ముఖ్యంగా గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు భారత్‌పై తీవ్ర ఒత్తిడిని పెంచుతున్నాయని అన్నారు. ఈ తరహా సంక్షోభాల వల్ల పెరిగే ఇంధన ధరల నుండి ప్రజలను రక్షించే క్రమంలో ఇచ్చే సబ్సిడీలు.. స్వచ్ఛమైన గ్రీన్ ఎనర్జీ వైపు మారే వేగాన్ని తగ్గిస్తాయని హెచ్చరించారు. ఈ సవాళ్లను సమర్థవంతంగా తట్టుకోవడానికి భారత్ తన పునరుత్పాదక (సోలార్, విండ్) ఇంధన వనరుల్లో భారీగా పెట్టుబడులు పెట్టడం ముఖ్యమని సూచించారు. అమెరికా విధిస్తున్న ఏకపక్ష సుంకాలు, అనిశ్చిత విధానాల వల్ల భారత్ తీవ్రంగా ప్రభావితమవుతోందని, దీనికి తోడు పెరిగిన అమెరికా బాండ్ రాబడులు రాబోయే ఐదేళ్లలో అధిక రుణ భారం ఉన్న అభివృద్ధి చెందుతున్న దేశాల వడ్డీ ఖర్చులను విపరీతంగా పెంచే ప్రమాదం ఉందని బెర్గ్‌లోఫ్ పేర్కొన్నారు.




# 120కి పైగా నగరాలకు విస్తరించిన 'అమెజాన్ నౌ'

ఈ-కామర్స్ రంగం దిగ్గజం అమెజాన్ ఫాస్ట్ డెలివరీలకు పెరుగుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని తన అల్ట్రా-ఫాస్ట్ డెలివరీ 'అమెజాన్ నౌ' సేవలను వేగంగా విస్తరిస్తోంది. కేవలం రెండు వారాల వ్యవధిలోనే ఈ సేవల పరిధిని రెట్టింపు చేస్తూ దేశవ్యాప్తంగా 120కి పైగా నగరాలకు విస్తరించినట్లు ప్రకటించింది. సుమారు 800 మైక్రో-ఫుల్‌ఫిల్‌మెంట్, అర్బన్ ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్ల నెట్‌వర్క్ సహాయంతో నిత్యవసరాలు, కిరాణా, ఫ్యాషన్, పర్సనల్ కేర్ నుండి చిన్న గృహోపకరణాల వరకు వేల ఉత్పత్తులను నిమిషాల వ్యవధిలోనే కస్టమర్లకుకు చేరుస్తోంది. ప్రతి త్రైమాసికంలో ఆర్డర్లు రెట్టింపు అవుతుండటంతో, అమ్మకాలు ఇప్పటికే 1 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని అమెజాన్ తెలిపింది. రాబోయే రోజుల్లో 300కి పైగా నగరాలకు విస్తరించి దేశంలోనే అతిపెద్ద 'డెలివరీ-ఇన్-మినిట్స్' నెట్‌వర్క్‌గా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు స్పష్టం చేసింది. అక్టోబర్ 8 నుండి ప్రారంభమయ్యే 'అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్' సందర్భంగా ఈ అల్ట్రా-ఫాస్ట్ డెలివరీ సేవలో భారీ ఆఫర్లు, ఎస్‌బీఐ కార్డులపై 10 శాతం తక్షణ డిస్కౌంట్లతో పాటు ప్రైమ్ సభ్యులకు అదనపు ప్రయోజనాలు అందిస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది.

# ఎఫ్ఎంసీజీ దిగ్గజం 'ఎవరెస్ట్'పై కేంద్రం చర్యలు




ప్రముఖ ఎఫ్ఎంసీజీ దిగ్గజం ఎవరెస్ట్ ఫుడ్ ప్రొడక్ట్స్‌కు చెందిన ప్యాకేజ్డ్ జీలకర్ర పొడికి సంబంధించి ఒక బ్యాచ్‌ను మార్కెట్ నుంచి వెంటనే వెనక్కి తీసుకోవాలని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఆదేశించింది. ఎవరెస్ట్ తయారు చేసిన 'ప్రీ-ప్యాక్డ్ జీలకర్ర పొడి' వినియోగానికి సురక్షితం కాదని తేల్చింది. గోవాలోని ఒక రిసార్ట్ నుండి సేకరించిన నమూనాలను విశ్లేషించగా, అందులో 'అజోక్సిస్ట్రోబిన్', 'థియామెథోక్సామ్' అనే ప్రమాదకర పురుగుమందుల అవశేషాలు పరిమితి కంటే ఎక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆ తర్వాత రెఫరల్ ఫుడ్ లేబొరేటరీ పరీక్షల్లోనూ ఇది నిర్ధారణ అయ్యింది. దీంతో ఆహార భద్రతా చట్టం-2006 ప్రకారం ఈ ప్రొడక్ట్‌ను సురక్షితం కాదని ప్రకటిస్తూ, సదరు బ్యాచ్‌లోని జీలకర్ర పొడిని మార్కెట్ నుండి తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఎవరెస్ట్‌ను ఆదేశించింది. అంతేకాకుండా, తీవ్రమైన పరిశుభ్రతా లోపాల కారణంగా 'క్రియేటివ్ బేకర్స్ అండ్ కన్ఫెక్షనర్స్' లైసెన్సును కూడా ఎఫ్ఎస్ఎస్ఏఐ తక్షణమే సస్పెండ్ చేసింది.




# అంత స్పెషల్ ఏంటో తెలుసా..?

ఒకప్పుడు స్నీకర్లను కేవలం క్రీడలకు లేదా సాధారణ అవసరాల కోసం ధరించే పాదరక్షలుగా మాత్రమే చూసేవారు. కానీ నేడు లగ్జరీ స్నీకర్స్ ఫ్యాషన్ రంగంలో అత్యంత కీలకమైన భాగంగా మారాయి. ఖరీదైన బ్రాండెడ్ వాటిని జిమ్ములు లేదా వాకింగ్‌కే పరిమితం చేయకుండా, ప్రజలు ఆఫీసులు, రెస్టారెంట్లు, పార్టీలు, సామాజిక వేడుకల్లో కూడా ఎంతో ఫ్యాషనబుల్‌గా ధరిస్తున్నారు. ఈ ధోరణి ప్రపంచవ్యాప్తంగా లగ్జరీ స్నీకర్స్ మార్కెట్‌ను భారీగా వృద్ధి చెందేలా చేస్తోంది. 2025 నాటికి ఈ మార్కెట్ సుమారు 46.2 బిలియన్ డాలర్లుగా ఉండగా, 2034 నాటికి ఇది సుమారు 98.7 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఇదే వృద్ధి వేగం కొనసాగితే 2031 నాటికి ఇది 75 బిలియన్ డాలర్ల మార్కును దాటే అవకాశం ఉంది. ఈ మార్కెట్ విస్తరణలో ఆసియా-పసిఫిక్ ప్రాంతం అగ్రస్థానంలో నిలిచింది. 2025లో ప్రపంచ విక్రయాలలో ఈ ప్రాంతం వాటా సుమారు 37.4%గా నమోదైంది. ఇందులో ఒక్క చైనానే ప్రధాన డిమాండ్ కేంద్రంగా ఉండి, ఆసియా-పసిఫిక్ కొనుగోళ్లలో సుమారు 61% వాటాను కలిగి ఉంది. చైనాలో పెరుగుతున్న మధ్యతరగతి వర్గం, యువతలో ఫ్యాషన్ పట్ల మక్కువ, బలమైన రీసేల్ మార్కెట్ ఇందుకు ప్రధాన కారణాలు. అలాగే దక్షిణ కొరియాలో కే-పాప్ ప్రభావం, జపాన్‌లో బలమైన స్నీకర్స్ కల్చర్ ఈ మార్కెట్‌కు మరింత ఊతమిస్తున్నాయి. ఈ సెగ్మెంట్‌లో గుచ్చి, గోల్డెన్ గూస్, బాలెన్సియాగా వంటి అంతర్జాతీయ బ్రాండ్లు ప్రత్యేక గుర్తింపు పొందాయి. బాలెన్సియాగా ట్రిపుల్ ఎస్, గోల్డెన్ గూస్ పాత లుక్‌తో కూడిన స్నీకర్స్ ఫ్యాషన్ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ లగ్జరీ పాదరక్షల ధరలు సాధారణంగా 400 డాలర్ల నుంచి 2,500 డాలర్ల వరకు ఉంటున్నాయి. పరిమిత సంఖ్యలో విడుదలయ్యే లిమిటెడ్ ఎడిషన్ మోడల్స్, సెలబ్రిటీల భాగస్వామ్యం ఈ డిమాండ్‌ను మరింత పెంచుతున్నాయి. డిజైన్ పరంగా చూస్తే లో-టాప్ స్నీకర్స్ అత్యధికంగా అమ్ముడవుతున్నాయి. 2025లో వీటి వాటా సుమారు 41.3%గా ఉంది. మెటీరియల్ పరంగా లెదర్ అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, యువతలో సింథటిక్ , ప్లాంట్-బేస్డ్ మెటీరియల్స్‌కు గిరాకీ పెరుగుతోంది. ఈ మార్కెట్ ఎదుగుదలలో జెన్ జెడ్ , మిల్లేనియల్స్ కీలక పాత్ర పోషిస్తున్నారు. 2025లో ఈ యువ కొనుగోలుదారుల సంయుక్త వాటా సుమారు 63.4%గా ఉంది. వీరు కేవలం బ్రాండ్ లోగో లేదా ధరను మాత్రమే కాకుండా, బ్రాండ్ విలువను, నాణ్యతను కూడా పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా 350 నుంచి 900 డాలర్ల ధర గల స్నీకర్స్ మార్కెట్ రాబడిలో సింహభాగాన్ని ఆక్రమిస్తున్నాయి. ఫ్యాషన్, సెలబ్రిటీ కల్చర్, సోషల్ మీడియా, రీసేల్ మార్కెట్ అన్నీ కలిసి లగ్జరీ స్నీకర్స్ వ్యాపారాన్ని సరికొత్త శిఖరాలకు చేరుస్తున్నాయి.




# 'రియాలిటీ' టైటిల్ గ్లింప్స్..

ఒకవైపు వరుస బ్లాక్‌బస్టర్ హిట్‌లతో దూసుకుపోతున్న టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం, ఇప్పుడు ఏకంగా మెగాఫోన్ పట్టుకుని కొత్త ప్రయాణాన్ని మొదలుపెట్టారు. ఇప్పటివరకు నటుడిగా అదరగొట్టిన ఆయన, ఇప్పుడు దర్శకుడిగా మారి ఒక విభిన్నమైన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటివరకు 'కె-13' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కిన ఈ చిత్రానికి ఆయన స్వయంగా కథ, స్క్రీన్‌ప్లే అందిస్తూ డైరెక్ట్ చేస్తుండటం విశేషం. తాజాగా కిరణ్ అబ్బవరం ఈ సినిమా నుంచి డబుల్ అప్డేట్స్ ఇచ్చి ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్ ఇచ్చారు. ఈ మూవీకి 'రియాలిటీ' అనే క్యాచీ టైటిల్‌ను ఫిక్స్ చేస్తూ.. అఫీషియల్ గ్లింప్స్‌తో పాటు రిలీజ్ డేట్‌ను కూడా అనౌన్స్ చేశారు. విడుదలైన గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచేలా ఉంది. అప్పులు లేని జీవితం, మధ్యతరగతి యువకుడి కష్టసుఖాలు, వాస్తవానికి చాలా దగ్గరగా ఉండే భావాలతో ఈ గ్లింప్స్ సాగింది. ఇందులో కిరణ్ అబ్బవరం ఆనందం పాత్ర అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుందని తెలుస్తోంది. తన హోటల్ ద్వారా కుటుంబాన్ని పోషించడమే కాకుండా నాణ్యమైన ఫుడ్ అందిస్తూ.. తన అప్పులను తీర్చుకుంటాడు. విడుదలైన గ్లింప్స్ సినీ ప్రియులను ఆకట్టుకుంటోంది. ఇక ఈ ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో కిరణ్ అబ్బవరం సరసన దేవికా భట్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. రాక్షస బలం ఉన్న శరత్ కుమార్, సాయి కుమార్ వంటి సీనియర్ నటులు కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. జాయ్ ఫిలింస్ బ్యానర్‌పై సుధాకర్ చాగంటి ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. శరవేగంగా షూటింగ్ పూర్తి చేసుకుంటున్న ఈ చిత్రం క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు.

# దృష్టి ఆ ఇండస్ట్రీ వైపు మళ్లింది...

తాను మలయాళ సినిమాలకు వీరాభిమానిని అని, అప్పుడప్పుడు అక్కడి సినిమాలు చూస్తుంటానని తెలిపారు. అయితే ఇటీవల ఏ సినిమా చూశానని మాత్రం తనను అస్సలు అడగవద్దని అన్నారు. మలయాళ చిత్ర పరిశ్రమలో భాగం కావాలనేది తన చిరకాల కోరిక అని, ఇప్పటివరకు ఆ అవకాశం కుదరలేదని చెప్పారు. అయితే దీనికి సమయం ఇంకా మించిపోలేదని, సరైన కథ దొరికితే వెంటనే మలయాళంలో నటిస్తానని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుత సినిమా ఇండస్ట్రీ ట్రెండ్ గురించి మాట్లాడుతూ.. ఒకప్పుడు అందరి చూపు బాలీవుడ్ వైపు ఉండేదని, కానీ ఇప్పుడు ఆ రోజులు పూర్తిగా మారిపోయాయని అన్నారు. ప్రస్తుతం అందరి దృష్టి మలయాళ చిత్ర పరిశ్రమ వైపు మళ్లిందని పేర్కొన్నారు. ఇక శృతి హాసన్ సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం ఆమె వరుస ప్రాజెక్ట్‌లతో ఫుల్ బిజీగా ఉన్నారు. మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఫీల్ గుడ్ డ్రామా 'ఆకాశంలో ఒక తార' చిత్రంలో ఆమె కీలక పాత్రలో కనిపించబోతున్నారు. పవన్ సాధినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను సమ్మర్ కానుకగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రంతో పాటు తమిళంలో విజయ్ సేతుపతి హీరోగా తెరకెక్కుతున్న 'ట్రైన్'లో కూడా శృతి హాసన్ నటిస్తున్నారు.






# ఓటీటీలో 'సర్దార్ 2' ఊచకోత..

సినిమా ఫలితాన్ని కేవలం థియేటర్ల కలెక్షన్లతోనే అంచనా వేయలేమని మరోసారి రుజువైంది. మొదటి ఆటకే థియేటర్లలో బోల్తా పడిన సినిమాలు సైతం.. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో సెన్సేషన్ సృష్టిస్తూ కొత్త రికార్డులను అందుకుంటున్నాయి. తాజాగా కోలీవుడ్ విలక్షణ నటుడు కార్తీ నటించిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'సర్దార్ 2' సరిగ్గా ఇలాంటి వింతైన ట్రెండ్‌నే నమోదు చేస్తూ సినీ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. థియేటర్లలో ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో విఫలమైన ఈ సినిమా, ఓటీటీ వేదికపై మాత్రం తిరుగులేని ఆదరణతో దూసుకుపోతోంది. గతంలో వచ్చిన సూపర్ హిట్ 'సర్దార్' చిత్రానికి సీక్వెల్‌గా కార్తీ, దర్శకుడు పీఎస్ మిత్రన్ కాంబినేషన్‌లో భారీ అంచనాల నడుమ 'సర్దార్ 2' రిలీజ్ అయ్యింది. అయితే థియేట్రికల్ రిలీజ్ సమయంలో ఆశించిన స్థాయిలో టాక్ తెచ్చుకోలేక, కలెక్షన్ల పరంగా బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది.దీంతో ఈ ప్రాజెక్ట్ రిజల్ట్ తేలిపోయిందని అంతా భావించారు. కానీ అసలైన ట్విస్ట్ డిజిటల్ రిలీజ్ తర్వాతనే మొదలైంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్‌కు వచ్చిన ఈ సినిమా కొన్ని గంటల్లోనే ఏకంగా ఇండియా ట్రెండింగ్‌లో నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకుంది. థియేటర్ల వద్ద టికెట్ కొని చూడటానికి వెనుకాడిన ప్రేక్షకులు.. ఇప్పుడు తమ ఇళ్లలోని డిజిటల్ తెరల ముందు కూర్చొని ఈ స్పై డ్రామాను ఎగబడి చూస్తున్నారు. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్, కార్తీ యాక్టింగ్ ఓటీటీ ఆడియన్స్‌కు విపరీతంగా కనెక్ట్ కావడంతో వ్యూవర్‌షిప్ రికార్డు స్థాయిలో నమోదవుతోంది. థియేటర్లలో ఫస్ట్ లైఫ్ మిస్సయినా.. ఓటీటీ రూపంలో వచ్చే సెకండ్ లైఫ్‌తో సినిమాలు ఎలాంటి అద్భుతాలు చేయగలవో చెప్పడానికి 'సర్దార్ 2' తాజా నిదర్శనంగా నిలిచిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బాక్సాఫీస్ లెక్కలు ఎలా ఉన్నా.. డిజిటల్ స్క్రీన్‌పై మాత్రం కార్తీ మార్క్ సత్తా మరోసారి స్పష్టంగా కనిపిస్తోందని చెబుతున్నారు.

# విద్యార్థుల మధ్య "క్రేజీ కల్యాణం"..

నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'క్రేజీ కల్యాణం'. ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. ఈ నెల 30న సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా తాజాగా ఈ చిత్రంలోని 'అల సెంద్రవంక' సాంగ్‌ను హైదరాబాద్ వోక్సెన్ యూనివర్సిటీ విద్యార్థుల సందడి మధ్య లాంచ్ చేశారు. ఈ ఈవెంట్‌లో హీరో అఖిల్ ఉడ్డెమారి పాల్గొని తన డ్యాన్సులతో,



మాటలతో భారీ సంఖ్యలో వచ్చిన విద్యార్థుల్లో జోష్ నింపారు. విద్యార్థులు ఉత్సాహంగా ఈ పాటకు స్టెప్స్ వేశారు. 'క్రేజీ కల్యాణం' మూవీ యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్‌ను ఆకట్టుకుంటుందని ఈ సందర్భంగా హీరో అఖిల్ చెప్పారు.

# తుపాకీ కాల్పులు లేవు...




టాలీవుడ్ టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు వరుసగా సినిమాలు చేస్తున్నప్పటికీ, బాక్సాఫీస్ వద్ద కొన్నిసార్లు అదృష్టం కలిసి రావడం లేదు. అయినప్పటికీ ఏమాత్రం నిరాశ చెందకుండా వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ, ముఖ్యంగా కామెడీ ఎంటర్‌టైనర్స్‌తో ప్రేక్షకులను అలరిస్తూ ఫుల్ జోరుమీదున్నారు. ఇప్పుడు అదే జోరుతో శ్రీవిష్ణు నటిస్తున్న తాజా చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్' ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. జానకీరామ్ మారెళ్ల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో శ్రీవిష్ణు సరసన మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అలాగే రాధిక శరత్ కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే కీలక పాత్రలలో కనిపించబోతున్నారు.స్కంద వాహన మోషన్ పిక్చర్స్, కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్లపై వెంకట కృష్ణ కర్నాటీ, సీతా కర్నాటీ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమాను అక్టోబర్ 9న గ్రాండ్‌గా థియేటర్లలో రిలీజ్ చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇక విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో తాజాగా, ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్నట్లు హీరో శ్రీవిష్ణు అభిమానులతో పంచుకున్నారు. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు నుంచి 'U/A' సర్టిఫికెట్ లభించినట్లు తెలిపారు. అంతేకాకుండా, సినిమాలో ఎలాంటి తుపాకుల కాల్పులు ఉండవని, కేవలం నవ్వుల సందడి మాత్రమే ఉంటుందని ఆయన ఒక ఆసక్తికరమైన క్యాప్షన్ జత చేశారు. వైవిధ్యమైన కామెడీతో రానున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.

# జాన్వీ కపూర్ సంచలన పోస్ట్

మహిళల గౌరవానికి భంగం కలిగించేలా సాగుతున్న ఏఐ మార్ఫింగ్ వీడియోల వివాదంపై సినీ నటి జాన్వీ కపూర్ స్పందించారు. సోషల్ మీడియా వేదికగా ఆమె పంచుకున్న లేఖ సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మహిళల వ్యక్తిగత స్వేచ్ఛ, శరీర హక్కులు, డిజిటల్ భద్రతపై ఆమె ప్రశ్నలు సంధించారు. మహిళల అనుమతి లేకుండా కల్పిత కంటెంట్‌ను ప్రచారం చేయడం నేరపూరిత ధోరణి మాత్రమే కాదు, అది లైంగిక దాడితో సమానమైన చర్య. చిత్ర పరిశ్రమలోని దాదాపు ప్రతి మహిళ ఏదో ఒక సందర్భంలో ఈ రకమైన వేధింపులను ఎదుర్కొంది. మహిళ ఐదు రోజులు వరుసగా 'సరే' అని చెప్పి, ఆరో రోజు 'వద్దు' అని చెబితే, ఆ తిరస్కరణను కచ్చితంగా గౌరవించాల్సిందేనని జాన్వీ స్పష్టం చేశారు. మహిళ ఏ దుస్తులు వేసుకున్నా, ఏ కోణంలో కెమెరా పెట్టి అసభ్యంగా చిత్రీకరించే హక్కు ఎవరికీ లేదని పేర్కొన్నారు. సమాజంలో మహిళల భద్రత కోసం కేవలం "కూతుళ్లను కాపాడుకోండి" అని చెప్పడం పరిష్కారం కాదని ఆమె విమర్శించారు. ఇతరుల హద్దులను ఉల్లంఘించే హక్కు తమకు ఉందనే భావజాలాన్ని సమాజం నుంచి సమూలంగా తుడిచిపెట్టాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.తాను ఎదుర్కొన్న ఏఐ వీడియోలు ఒక భాగం మాత్రమేనని, మహిళగా నిత్యం ఎదురయ్యే తీర్పులు, చూపులు, శారీరక భయాలు ఇప్పుడు డిజిటల్ ప్రపంచంలోకి మరింత విస్తరించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అన్యాయంపై గళమెత్తి, అండగా నిలిచినందుకు జూనియర్ ఎన్టీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఈ సమస్యపై స్పందించి, తప్పును తప్పని ఎత్తిచూపిన మెగాస్టార్ చిరంజీవి, విజయ్ దేవరకొండ, ఖుష్బూలకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. మహిళను ఒక మనిషిగా గుర్తించి గౌరవించడం చాలా పెద్ద కోరికేమీ కాదని చెబుతూ, "ఆమె శరీరం, ఆమె ప్రతిష్ఠ, ఆమె సరిహద్దులు, ఆమె ఎంపిక" అనే నినాదంతో ఆమె తన స్పందనను ముగించారు.





# 'రణబాలి' టికెట్ రేట్ల పెంపు వివాదం

టాలీవుడ్‌లో పెద్ద సినిమాలు వస్తున్నాయంటే చాలు, ప్రేక్షకుల జేబులకు చిల్లు పడటం ఖాయమనే ప్రచారం సర్వసాధారణమైపోయింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో టికెట్ ధరల పెంపు చుట్టూ గత కొద్ది రోజులుగా తీవ్రమైన చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే రాబోయే క్రేజీ చిత్రం 'రణబాలి' కూడా టికెట్ రేట్లు పెంచబోతోందని, ఇందుకోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారంటూ సోషల్ మీడియాలో కథనాలు తెగ చక్కర్లు కొట్టాయి. పండుగ వేళ సినిమా చూడాలనుకునే సామాన్య ప్రేక్షకుడికి ఈ వార్త పెద్ద షాకిచ్చింది. ఏపీలో సినిమా టికెట్ ధరలు భారీగా పెరగనున్నాయంటూ జరిగిన ప్రచారంపై మూవీ మేకర్స్ తాజాగా ఘాటుగా స్పందించారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు, అటు తెలంగాణలోనూ ఎలాంటి టికెట్ రేట్ల పెంపు కోసం తాము ప్రభుత్వాలను ఆశ్రయించలేదని అధికారికంగా స్పష్టం చేశారు.కేవలం హైప్ కోసమో లేదా కొందరు కావాలని సృష్టించిన తప్పుడు ప్రచారమే ఇదని కొట్టిపారేశారు. టికెట్ రేట్లు పెంచి ప్రేక్షకులను థియేటర్లకు దూరం చేసే ఆలోచన తమకు లేదని యూనిట్ పేర్కొంది. సాధారణ (స్టాండర్డ్) ధరలకే 'రణబాలి' థియేటర్లలో ప్రదర్శితమవుతుందని వెల్లడించారు. టికెట్ భారం లేకుండా అందరూ కుటుంబ సమేతంగా వచ్చి పండుగ సీజన్‌లో అద్భుతమైన సినిమా అనుభూతిని పొందవచ్చని చిత్ర బృందం నమ్మకం వ్యక్తం చేసింది. అక్టోబర్ 16న 'రణబాలి' ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది. ఇప్పటివరకు నడిచిన ఊహాగానాలకు తెరపడటంతో మూవీ లవర్స్‌కు ఇది నిజంగా ఊరటనిచ్చే విషయమనే చెప్పాలి.

# రోమియో పక్కన జూలియట్‌గా ప్రీతిముకుందన్?

నేచురల్ స్టార్ నాని దర్శకుడు సుజీత్‌తో కలిసి 'బ్లడీ రోమియో' అనే హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా చేయనున్న సంగతి తెలిసిందే. వినూత్నమైన కథాంశంతో, డార్క్ హ్యూమర్ మేళవించిన స్టైలిష్ గ్యాంగ్‌స్టర్ కథగా రూపుదిద్దుకుంటున్న ఈ మోస్ట్ ఎవైటెడ్ ప్రాజెక్ట్‌పై ఆరంభం నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ సినిమాకు సంబంధించి క్యాస్టింగ్ విషయంలో ఫిల్మ్‌నగర్ వర్గాల్లో ఒక ఆసక్తికర వార్త నెట్టింట వైరల్ అవుతోంది.ఈ సినిమాలో కథానాయికగా నిన్నటి వరకు 'లక్కీ భాస్కర్' ఫేమ్ మీనాక్షి చౌదరి పేరు ప్రముఖంగా వినిపించింది. మేకర్స్ కూడా మొదట ఆమెనే ప్రతిపాదించారని సమాచారం. కానీ తాజా సమాచారం ప్రకారం, ఈ రేసులోకి మరో తమిళ భామ ప్రీతి ముకుందన్ వచ్చి చేరినట్లు టాక్ నడుస్తోంది. దర్శకుడు సుజీత్ డిజైన్ చేసిన పాత్రకు మీనాక్షి కంటే ప్రీతి ముకుందన్ బాగా సెట్ అవుతాయని భావించిన మేకర్స్, ఆమె వైపే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ యంగ్ బ్యూటీ పేరునే దాదాపు ఫైనల్




చేసినట్లు సమాచారం. యూకే బ్యాక్‌డ్రాప్‌లో ఫుడ్ అండ్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా తెరకెక్కనున్న ఈ సినిమాలో నాని సరికొత్త లుక్‌లో కనిపించనున్నారు. పాన్ ఇండియా లెవల్లో గ్రాండ్ లెవెల్‌లో తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్‌పై మేకర్స్ అధికారికంగా హీరోయిన్ ఎవరో త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. ప్యారడైజ్ ఫ్లాప్ తర్వాత నాని నుండి రాబోతున్నబ్లడీ రోమియో బాక్సాఫీస్ వద్ద ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేస్తుందో వేచి చూడాలి. నిహారిక ఎంటర్టైన్మెంట్స్ పాటు నాని సొంత సంస్థ యూనానిమస్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**